జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి ఆదివారం 22 మార్చి 2026 సంపుటి : 1 సంచిక : 78 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516
విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి
Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## కూటముల కోలాటం

- కేరళలో ఆసక్తికర పోరు
- ఎల్డీఎఫ్, యూడీఎఫ్ హోరాహోరీ
- రెండు కూటములకూ బీజేపీ బెంగ

5



## భారత వైఖరిని మోదీ చెప్పారు


- యుద్ధంపై భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- 'చర్చలు, దౌత్యంతో సమస్యలను పరిష్కరించుకోవాలని మోదీ చెప్పారు
- ప్రపంచం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది
- మీకు తెలుసు, ప్రస్తుతం ప్రపంచంలో యుద్ధం జరుగుతోంది
- ఉద్రిక్తతలు తగ్గించేందుకు దౌత్య ప్రయత్నాలు చేయాలి

# ఇక జస్ట్ హైవేనే!

**అద్భుత ఎక్స్‌ప్రెస్ వే డిజైన్ కాస్తా సాధారణ జాతీయ రహదారిగా మార్పు**

- భారీ వ్యయానికి జడిసి ప్రత్యేకతలన్నీ తొలగిస్తున్న కేంద్రం
- ఓఆర్ఆర్‌ను మించి నిర్మితమవుతుందనుకుంటే.. అంచనాలన్నీ తల్లకిందులు
- ఇప్పటికే 8 వరుసలకు బదులు6 వరుసలకు కుదింపు, సర్వీ స్ రోడ్డు స్థానంలో యాక్సెస్ పాత్
- తాజాగా ఎక్స్‌ప్రెస్ వే హోదా తొలగింపు.. వేగ పరిమితి 120 కి.మీ. నుంచి 100 కి.మీ.లోపునకు తగ్గింపు
- ఒక్క ఉత్తర భాగంలోనే మొత్తం వంతెనలు 204 నుంచిసగానికి తగ్గిపోనున్న వైనం

సర్వీస్ రోడ్డు కాదు కదా కనీసంకచ్చా రోడ్డు కూడా లేకుండా డిజైన్ మార్పు



హైదరాబాద్

'ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)ను మించిన అద్భుత ఎక్స్‌ప్రెస్ వేగా రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) రాబోతోంది, అది తెలంగాణకు గేమ్ ఛేంజర్ కాబోతోంది..'అంటూ ఊరించిన కేంద్రం చివరకు ఉసూరుమనిపించింది. ఓఆర్ఆర్‌తో పోలిస్తే ట్రిపుల్ ఆర్ దిగదుడుపుగానే ఉండనుంది. నిర్మాణ వ్యయానికి జడిసి ఇప్పుడు ట్రిపుల్ ఆర్‌ను సాధారణ జాతీయ రహదారి ప్రమాణాలతో సరిపెట్టుకుని నిర్మించాలని దాదాపు ఓ నిర్ణయానికి వచ్చింది. అంటే దానికి ఎక్స్‌ప్రెస్‌వే హోదా ఉండదు. ఫలితంగా ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి ముందే చాలా ప్రత్యేకతలను కోల్పోయింది. ట్రిపుల్ ఆర్ నిర్మాణ వ్యయం ఉత్తర, దక్షిణ భాగాలు కలిపి దాదాపు రూ.38 వేల కోట్లను మించేలా ఉండటాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ రోడ్డుకు ఇంత భారీ మొత్తాన్ని వెచ్చించటం సరికాదని తేల్చిన అధికారులు, వీలైనంత మేర నిర్మాణ వ్యయాన్ని తగ్గించాలని గత రెండు నెలలుగా ఢిల్లీలో కసరత్తు చేపట్టారు. విడతల వారీగా ప్రత్యేకతలు తగ్గిస్తూ, బడ్జెట్‌లో కోత పెడుతూ అంచనా వ్యయాన్ని తగ్గించుకుంటూ వస్తున్నారు. ఇప్పటికే 8 వరుసలకు బదులు 6 వరుసలకు కుదించారు. సర్వీసు రోడ్డు స్థానంలో సాధారణ యాక్సెస్ పాత్ - మిగతా2లో

## మూడు దశల్లో 'భద్రాద్రి' పునరాభివృద్ధి



**గోదావరి పుష్కరాల నాటికి మొదటి దశ పూర్తి కావాలి**

**సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ పునరాభివృద్ధిని మూడు దశల్లో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల నాటికి తొలి విడత పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని చెప్పారు. తొలి దశ పనులు వచ్చే సంవత్సరం మార్చి 31 నాటికి పూర్తయ్యేలా చూడాలన్నారు. శనివారం రాత్రి ఆయన ఆలయ పునరాభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, - మిగతా2లో



## ముగిస్తాం.. విరుచుకుపడతాం

- యుద్ధంపై అమెరికా, ఇజ్రాయెల్ చెరో మాట
- ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై వైమానిక దాడులు
- డిగో గార్సియాపైకి క్షిపణులు ప్రయోగించిన టెహ్రాన్
- ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తేసిన అమెరికా
- హర్మూజ్‌ను తెరవండి.. 22 దేశాల విజ్ఞప్తి

5


# సిట్‌కు చిక్కిన డ్రగ్ పెడ్లర్

- పోలీసుల అదుపులో అభిషేక్‌సింగ్
- రోహిత్‌రెడ్డి డ్రైవర్‌కు మత్తు పదార్థాలు విక్రయించిన నిందితుడు
- 24 సార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు సమాచారం
- మాజీ ఎమ్మెల్యే ఫామ్‌హౌస్‌లో కొనసాగుతున్న పోలీస్ పహారా



మొయినాబాద్, శంషాబాద్ రూరల్:

ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో కీలక నిందితుడు సిట్ అధికారులకు చిక్కాడు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి డ్రైవర్‌కు డ్రగ్స్ సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, డ్రగ్ పెడ్లర్ అభిషేక్‌సింగ్‌ను శనివారం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ కోసం డ్రగ్స్ సరఫరా చేసినట్లు తేలింది. ఇతని ద్వారా డ్రగ్స్ మూలాలను గుర్తించడంపై సిట్ ప్రత్యేక దృష్టి సారించింది. అభిషేక్ నుంచి - మిగతా2లో



**కేరళలో మరోసారి**

## షిగెల్లా కలకలం

- 12మందికి పాజిటివ్- ఒక చిన్నారి మృతి!
- షిగెల్లా కేసులు పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన
- తాజాగా 12 మందికి వైరస్ సోకినట్లు వెల్లడి
- ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ అప్రమత్తం
- నివారణ చర్యలు ముమ్మరం

5

## స్వేచ్ఛా నౌకాయానం, సముద్ర మార్గాల భద్రత ముఖ్యం

- ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ
- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని
- ఈద్, నౌరోజ్ శుభాకాంక్షలు తెలిపిన పీఎం
- పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పుతాయని ఆశిస్తున్నాను
- ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీసే మౌలిక సదుపాయాలపై దాడులను ఖండించాను



# ఇక జస్ట్ హైవేనే!

-మొదటిపేజీ తరువాయి

తీసుకొచ్చి ఆ తర్వాత దాన్ని కూడా తొలగించారు. స్ట్రీట్ లైటింగ్‌ను పట్టణ ప్రాంతాలకే పరిమితం చేశారు. అండర్ పాస్‌ల సంఖ్యను సగానికి తగ్గించేశారు. తాజాగా మరోసారి సమీక్షించిన అధికారులు ఇప్పుడు ఏకంగా ఎక్స్‌ప్రెస్‌వే హోదా తొలగించేశారు. దీంతో ట్రిపుల్ ఆర్ మరిన్ని ప్రత్యేకతలు కోల్పోనుంది. ఓఆర్‌ఆర్ ముందు వెలవెల పోనుంది. ఓఆర్‌ఆర్ మీద వాహనాలు గంటకు 120 కి.మీ. వేగంతో వెళ్తుండగా, ట్రిపుల్ ఆర్‌పై వేగం 100 ఉండనుంది. మొత్తం మీద ఈ కోతల వల్ల అంచనా వ్యయం 25 శాతం మేర తగ్గుతుందని భావిస్తున్నారు.

ట్రిపుల్ ఆర్ ప్రతిపాదనలు తొలుత ఎలా... ఇప్పుడెలా?

తొలుత: దేశంలోనే తొలి అతి పొడవైన ఎక్స్‌ప్రెస్‌వే రింగురోడ్డు. దాదాపు 362 కి.మీ. నిడివితో ఓ నగరానికి రింగు రోడ్డుగా ఉండటం దేశ రోడ్ నెట్‌వర్క్‌లో ఓ రికార్డు.

ఇప్పుడు: నిడివిలో మార్పు లేనప్పటికీ, ఎక్స్‌ప్రెస్ వేకు ఉండే ప్రత్యేకతల్లో భారీగా కోత పెట్టి సాధారణ హైవేగా మార్చేశారు.

తొలుత: దేశంలోనే 8 లేన్లతో కూడిన అతి పొడవైన రింగురోడ్డుగా దీన్ని ప్రతిపాదించారు. హైదరాబాద్ ఔటర్ కూడా 8 వరుసలతో ఉండగా, దానికి రెట్టింపు నిడివితో ట్రిపుల్ ఆర్‌ను ప్రతిపాదించారు.

ఇప్పుడు: 8 వరుసల ఆలోచనను విరమించుకున్నారు. మరో 20 ఏళ్ల వరకు రోడ్డు ట్రాఫిక్‌కు 6 వరుసలు సరిపోతాయని, 8 వరుసలు వృథా వ్యయమంటూ 6 వరుసలకు కుదించేశారు.

తొలుత: సాధారణంగా ఎక్స్‌ప్రెస్‌వే/జాతీయ రహదారులపై పట్టణాలు, గ్రామాలు ఉన్న చోటనే లైటింగ్ వ్యవస్థ ఉంటుంది. కానీ హైదరాబాద్ ఓఆర్‌ఆర్ పొడవునా దీపాలు ఏర్పాటు చేసిన తరహాలోనే ట్రిపుల్ ఆర్ పొడవునా ఎల్‌ఈడీ స్ట్రీట్ లైటింగ్ వ్యవస్థ ప్రతిపాదించారు.

ఇప్పుడు: అంత నిడివితో ఎల్‌ఈడీ స్ట్రీట్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి కేవలం జనావాసాలు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

తొలుత: 162 కి.మీ. నిడివితో ఉత్తర భాగంలోనే మొత్తం 204 వంతెనలు నిర్మించాలని భావించారు. జాతీయ రహదారులు, ప్రధాన రాష్ట్ర రహదారులు క్రాస్ చేసే 11 ప్రాంతాల్లో భారీ ఇంటర్‌ఛేంజ్ వంతెనలు, మూసీ నది మీద వలిగొండ మండలం పొద్దుటూరు వద్ద, మంజీరా నది మీద పుల్కల్ మండలం శివ్వంపేట వద్ద, హరిద్రానది మీద తూప్రాన్ వద్ద 3 పెద్ద వంతెనలు, వాగులు వంకల మీద 105 సాధారణ వంతెనలు, పంట కాల్వలు, నీటిపారుదల శాఖ కాలువలు, చిన్న రోడ్లకు సంబంధించి 85 కల్వర్టులు ప్రతిపాదించారు.

ఇప్పుడు: వంతెనల వ్యయం భారీగా ఉండటంతో పొదుపు చర్యలు ప్రధానంగా ఇక్కడే చేపట్టారు. వంతెనల సంఖ్యను సగానికి సగం కుదించనున్నారు. దీంతో కొన్ని చిన్న దారుల వద్ద రోడ్డును దాటే వీలుండదు. ముందుకో, వెనక్కో వెళ్లి యూ టర్న్ తీసుకుకోవాల్సి ఉంటుంది.

తొలుత: ఓఆర్‌ఆర్ తరహాలో ట్రిపుల్ ఆర్‌కు కూడా సర్వీసు రోడ్డును ప్రతిపాదించారు. తర్వాత ఆ ఆలోచన విరమించుకుని సాధారణ యాక్సెస్ పాత్‌ను ఖాయం చేశారు. అంటే ఫుట్‌పాత్ లాంటివి లేని ఓ కచ్చా రోడ్డు అన్నమాట.

ఇప్పుడు: కచ్చా రోడ్డుతో కూడిన యాక్సెస్ పాత్‌ను సైతం విరమించుకున్నారు. పెద్ద చెరువు కట్ట తరహాలో ఉండే ఈ ప్రధాన క్యారేజ్ వే దిగువన ఎలాంటి రోడ్డు ఉండదు. వట్టి ఖాళీ స్థలం మాత్రమే ఉంటుంది. దానిపైనే వాహనాలు రాకపోకలు సాగించాలి.

తొలుత: 8 వరసల రోడ్డు, ఎక్స్‌ప్రెస్ ప్రమాణాలతో నిర్మాణం, వాహనాల వేగ పరిమితి 120 కి.మీ.కుపైగా అయినందున రోడ్డు ఎంబ్యాంక్‌మెంట్(రోడ్డు కట్ట) 5 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తుతో నిర్మించేలా డిజైన్ చేశారు. అప్పుడు రోడ్డు ఉపరితలంలో నిలువు వాలు 1,300 మీటర్ల ముందే ప్రారంభం అయ్యేలా నిర్మించేందుకు వీలవుతుంది.

ఇప్పుడు: సాధారణ ఎన్‌హెచ్ ప్రమాణాలతో నిర్మిస్తున్నందున రోడ్డు ఎత్తు కూడా తక్కువగా ఉంటుంది.

తొలుత: వాహనాలు గంటకు 160 కి.మీ. మించిన వేగంతో దూసుకుపోయినా ఇబ్బంది లేని విధంగా డిజైన్ ప్రతిపాదించారు. అధికారిక వేగ పరిమితిని 120 కి.మీ.గా పేర్కొన్నారు. రోడ్డు నిలువు వాలు (వర్టికల్ కర్వ్) 1300 మీటర్లు ఉండేలా డిజైన్ చేశారు. అంటే ఒక మీటర్ మేర రోడ్డు పల్లం (డీప్) కావాలంటే 1300 మీటర్ల నుంచే ఎత్తు తగ్గడం ప్రారంభమవుతుందన్న మాట. (వాలు మొదలు అవుతుంది) దీంతో 600 మీటర్ల ముందు వరకు రోడ్డు విజిబిలిటీ ఉంటుంది. అంత దూరంలో పిల్లి సైజు జంతువు రోడ్డు దాటుతున్నా కనిపిస్తుంది. ముందే అప్రమత్తమై వేగాన్ని నియంత్రించేందుకు వీలవుతుంది.

ఇప్పుడు: గరిష్ట వేగం 100కు కుదించారు. రోడ్డు నిలువు వాలు 650 మీటర్లకు పరిమితం చేశారు. అంటే ఎత్తు, పల్లంల వద్ద వాహనాల గరిష్ట విజిబిలిటీ దూరం కవలం 360 మీటర్లు మాత్రమే ఉంటుంది. వాహనాలు ఒకవేళ పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తే ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది.

## సిట్‌కు చిక్కిన డ్రగ్ పెడ్లర్

-మొదటిపేజీ తరువాయి

రోహిత్‌రెడ్డి బృందం సుమారు 24 సార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు సమాచారం. అభిషేక్‌సింగ్ పోలీసులకు చిక్కడంతో అతని నుంచి డ్రగ్స్ ఎవరెవరు, ఎప్పుడెప్పుడు కొనుగోలు చేశారనే కోణంలో సిట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇతనితో కొనుగోలుదారులు జరిపిన ఆర్థిక లావాదేవీలు, ఫోన్ చాటింగ్ డేటాను పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే 11 మందిపై కేసు నమోదు చేయగా.. రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, నమిత్‌శర్మ జైలుకు వెళ్లారు. మిగతా వారిలో టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌తో పాటు మరో ఏడుగురికి బెయిల్ మంజూరైంది. మహేశ్‌కుమార్ మినహా.. మిగిలిన వారంతా ఐదు రోజులుగా శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో సిట్ విచారణకు హాజరవుతున్నారు. కేసు దర్యాప్తుపై ఫ్యూచర్ సిటీ కమిషనర్ స్యుధీర్‌బాబు ఎప్పటికప్పుడు కీలకమైన సూచనలు చేస్తున్నారు. ఆయన నిందితులను నేరుగా విచారించి పలు విషయాలు తెలుసుకుంటున్నారు. రిమాండ్‌లో ఉన్న ముగ్గురిని కస్టడీకి తీసుకుంటే ఈ కేసులో పురోగతి సాధించవచ్చని సిట్ అధికారులు భావిస్తున్నారు. కస్టడీ పిటిషన్‌పై తీర్పు సోమవారం వెలువడే అవకాశం ఉందని చెపుతున్నారు.

**పోలీస్ పహారాలో ఫామ్‌హౌస్..**

వివాదాలకు కేంద్ర బిందువైన మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో పోలీస్ పహారా కొనసాగుతోంది. ఈ నెల 14న ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ సంచలనంగా మారిన విషయం తెలిసిందే. డ్రగ్స్ పార్టీని భగ్నం చేసేందుకు ఈగల్ టీం, స్థానిక పోలీసులు వెళ్లడంతో నాలుగు రౌండ్ల కాల్పులు జరిగాయి. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం విచారణకు సిట్ ఏర్పాటు చేసింది. పార్టీలో పాల్గొన్న నిందితులకు చెందిన ఆరు లగ్జరీ కార్లు ఫామ్‌హౌస్‌లోనే ఉన్నాయి. ఆ రోజు నుంచి పోలీసులు ఫామ్‌హౌస్‌లో పహారా కాస్తూ.. బయటి వ్యక్తులను లోనికి రానివ్వడంలేదు. మరోవైపు అసైన్డ్ భూమిలో ఉన్న ఫామ్‌హౌస్‌ను సీజ్ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే భూ రికార్డులను పరిశీలించిన అధికారులు న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సమాచారం. అనుమతులు లేకుండా రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో చేపట్టిన నిర్మాణాలను కూల్చడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## మూడు దశల్లో 'భద్రాద్రి' పునరాభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు తదితరులతో సమీక్షించారు. పుష్కరాల నాటికి మొదటి దశ పనులు పూర్తిచేసి, పుష్కరాల అనంతరం మిగతా పనులు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పుష్కరాల కోసం గోదావరి తీరంలో భక్తులకు వసతి కల్పించాలన్నారు. భక్తుల దర్శనాలు కొనసాగుతుండగానే ఆలయ అభివృద్ధి పనులు జరపనున్నందున, భక్తులకు ఇబ్బంది కలగకుండా పనులు జరగాలని చెప్పారు. ఆలయ సహజత్వానికి భంగం కలగకుండా ఆగమశాస్త్రబద్ధంగా పునరాభివృద్ధి ఉండాలని పేర్కొన్నారు.

# సిటీ మెట్రో డీలక్స్, ఏసీ బస్సు చార్జీల తగ్గింపు

హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో తిరుగుతున్న మెట్రో డీలక్స్, మెట్రో లగ్జరీ ఏసీ బస్సు చార్జీలను ఆర్టీసీ తగ్గించింది. టికెట్ ధరలను సవరించనప్పటికీ, డిస్కౌంట్ పేరుతో ప్రస్తుతానికి తగ్గించింది. మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉండే చార్జీలతో సమం చేసింది. మూడు నెలల పాటు దీనిని ప్రయోగాత్మకంగా పరిశీలించనుంది. చార్జీల తగ్గింపు నేపథ్యంలో ఈ మూడు నెలల పాటు ఆ బస్సులకు ఆదరణ పెరిగితే, ఇవే చార్జీలను కొనసాగించటంతోపాటు ఆ కేటగిరీ బస్సుల సంఖ్యను పెంచాలని ఆర్టీసీ నిర్ణయించింది.

**పురుషులకు సీట్ల కొరత..**

ప్రస్తుతం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ ఆర్డినరీ (పల్లె వెలుగు కూడా), మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే వీలుంది. ఈ వెసులుబాటు మొదలైనప్పటి నుంచి ఆ రెండు కేటగిరీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. ఇతర కేటగిరీ బస్సుల్లో వెళ్లే చాలామంది మహిళలు, అలాగే ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించే మహిళలు ఈ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఫలితంగా ఆ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) వంద శాతాన్ని దాటింది. ముందు వైపు ఉండే మహిళల సీట్లు నిండిపోయి, వెనకవైపు సీట్లలో కూడా మహిళా ప్రయాణికులు కూర్చుంటున్నారు.

ఫలితంగా పురుషులకు సీట్లు పరిమితంగానే ఉంటున్నాయి. దీనిపై పురుష ప్రయాణికుల నుంచి అనేక ఫిర్యాదులొచ్చాయి. ఈ నేపథ్యంలో, మెట్రో డీలక్స్ పేరుతో కొత్త కేటగిరీ సర్వీసును ఆర్టీసీ మొదలుపెట్టింది. వీటిల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వెసులుబాటు లేనందున ఎక్కువ సీట్లు పురుష ప్రయాణికులకు అందుబాటులో ఉంటున్నాయి. కానీ, ఇది డీలక్స్ కేటగిరీ సర్వీసు కావటంతో టికెట్ ధర కాస్త ఎక్కువగా ఉంది. దీనివల్ల ఆశించిన స్థాయిలో ఆక్యుపెన్సీ రేషియో నమోదుకాలేదు. దీనిపై ఇటీవల




అధికారులు సర్వే చేసి కారణాలను విశ్లేషించారు. టికెట్ ధర ఎక్కువగా ఉందన్న మాట చాలా మంది నుంచి వినిపించింది. మహాలక్ష్మి పథకం వల్ల ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో తమకు సీట్లు దొరకటం లేదని, వాటిని వదిలి ఎక్కువ టికెట్ ఖర్చుతో డీలక్స్ బస్సులో వెళ్లటం ఏం న్యాయమని కొందరు ప్రశ్నించారు. దీంతో డీలక్స్ బస్సుల టికెట్ ధరను కొంత తగ్గించాలని ఆర్టీసీ నిర్ణయించింది. అయితే, టికెట్ ధరలను సవరించాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. తిరిగి పెంచితే ప్రయాణికుల నుంచి వ్యతిరేకత వస్తుంది.

ఈ నేపథ్యంలో సంస్థ తన అధికారాన్ని ఉపయోగించి డిస్కౌంట్‌ను ప్రకటించింది. మార్చి నుంచి మే వరకు ఇది అమలులో ఉంటుంది. ప్రస్తుతం సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉన్న టికెట్ చార్జీలనే వీటిల్లో అమలు చేస్తున్నారు. పనిలోపనిగా, నగరంలో తిరుగుతున్న మెట్రో లగ్జరీ(ఎయిర్‌పోర్టుకు తిరిగే పుష్పక్ కాకుండా) ఏసీ బస్సుల్లో కూడా ఎక్స్‌ప్రెస్ చార్జీలనే అమలు చేయనున్నారు. ఈ మూడు నెలల పాటు పరిశీలించి, ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో పెరిగితే కొంతకాలం పాటు అవే చార్జీలను కొనసాగించటంతోపాటు, ఆ బస్సుల సంఖ్యను రెట్టింపు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది.

## నగరం పరుగెడుతోంది..

## ప్రజారవాణా పడుతూ లేస్తోంది!



హైదరాబాద్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో జనాభాతో పాటు ప్రైవేటు వాహనాలు పెరుగుతున్నాయి. దీంతో రోడ్లపై వాయు కాలుష్యం అధికమవుతోంది. దక్షిణాదిలోని మిగతా మెట్రో నగరాలైన చెన్నై, బెంగళూరుతో పోలిస్తే పీఎం 10 ఉద్గారాలూ హైదరాబాద్‌లోనే అధికం. పరిస్థితి ఇలానే కొనసాగితే కాలుష్యంలో ఢిల్లీతో పోటీపడతామని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం లోపభూయిష్టమైన ప్రజారవాణానే అనేది తేటతెల్లం. ప్రజారవాణాలోని ప్రయాసలను భరించలేక ఎక్కువ మంది వ్యక్తిగత వాహనాలనే వినియోగిస్తున్నారు. దీంతో నగరం 'వాయు'గండంగా మారుతోంది. మెట్రో వచ్చినా.. డిమాండ్‌కు తగ్గట్టు సర్వీసులు, కోచ్‌లు పెరగకపోవడం, చివరి గమ్యస్థానం వరకు చేరడానికి అనుసంధాన ప్రజారవాణా లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. సమయపాలన లేని ఎంఎంటీఎస్‌లు ఆదరణ కోల్పోతున్నాయి. సిటీ బస్సులూ గత తొమ్మిదేళ్లలో వందల్లో తగ్గిపోయాయి. ఇదే సమయంలో ఢిల్లీ, ముంబయి నగరాలు మెట్రో, ఎంఎంటీఎస్ సేవల వినియోగంలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. హైదరాబాద్ మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటీఎస్) ఒకప్పుడు నగర ప్రజారవాణా వ్యవస్థలో కీలకంగా నిలిచింది. కరోనాకు ముందు రోజుకు సుమారు 1.20 లక్షల మంది వరకు ఎంఎంటీఎస్‌లో ప్రయాణించేవారు. ప్రస్తుతమా సంఖ్య 45 వేలకు పడిపోయింది. టికెట్ ధర తక్కువే అయినా సమయపాలన లేకపోవడంతో ఆదరణ తగ్గుతోంది. ముంబయిలో ప్రజారవాణాకు లోకల్ రైళ్ల వ్యవస్థ జీవనాడి. అక్కడ నాన్ ఏసీ, ఏసీ లోకల్ రైళ్లు నడుస్తుండటం, ఉదయం 4 నుంచే అందుబాటులో ఉంటుండటంతో వాటికి మంచి డిమాండ్ ఉంది.

# మావోలకు 'డెడ్'లైన్.. మరో పది రోజులే!

హైదరాబాద్:

'మార్చి 31 నాటికి భారత దేశాన్ని మావోయిస్టు రహిత దేశంగా మారుస్తాం'గత రెండేళ్లుగా పలు వేదికలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేస్తున్న ప్రకటన ఇది. తాజాగా ఈ నెల 6న ఒడిశాలోని కటక్ జిల్లా ముందలిలో జరిగిన సీఐఎస్‌ఎఫ్ 57వ ఆవిర్భావ దినోత్సవంలోనూ 'తిరుపతి నుంచి నేపాల్‌లోని పశుపతినాథ్ వరకు రెడ్ కారిడార్ నిర్మించాలని కలలు కనే శక్తులను మన భద్రత దళాలు కచ్చితంగా ఓడిస్తాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో నక్సలిజం అంతం కావడమే లక్ష్యం'అంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు. మార్చి 31 లోపు అజ్ఞాతం వీడి లొంగిపోని మావోయిస్టుల పట్ల కఠిన వైఖరే అని కూడా అమిత్ షా సుస్పష్టంగా చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ప్రకారం..ఈనెల 31న మావోయిస్టులకు 'డెడ్'లైన్ పూర్తవుతుంది, మరో పదిరోజులే గడువు ఉంది, అయితే ప్రభుత్వాలు చెబుతున్నట్టు మార్చి 31 తర్వాత మావోయిస్టులు లేని భారత్ సాధ్యమేనా..? మరోవైపు పౌరహక్కుల నేతలు, మాజీ మావోయిస్టులు, అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు చెబుతున్నట్లుగా డెడ్‌లైన్‌లు పెట్టి సిద్ధాంతాలు అంతం చేయలేరన్న వాదనలు గెలుస్తాయా..? అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉత్కంఠగా మారింది. ఇంకా మావోయిస్టులలో వందలాది మంది సాయుధులు ఉన్నారని, మావోయిస్టులను అంతం చేయడం ప్రభుత్వాలు అనుకున్నంత సులువేంకాదని ఇటీవల జనజీవనస్రవంతిలోకి వచ్చిన కేంద్ర కమిటీ సభ్యుడు ఒకరు ధీమా వ్యక్తం చేశారు.

**ఆ ఏడుగురు తిరిగొచ్చేనా...?**

మావోయిస్టుల్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు 2023లో 125 మంది ఉండగా..ప్రస్తుతం ఆ సంఖ్య ఏడుకు పరిమితమైందని పోలీసులు అధికారికంగా ప్రకటించారు. కేంద్ర కమిటీ సభ్యులు దేవ్‌జీ అలియాస్ టిపిరి తిరుపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, చంద్రన్న సహా ఎంతో మంది కీలక నేతలు నెలల వ్యవధిలోనే లొంగుబాట పట్టారు. అయితే తాము అరెస్టు అయ్యామని చెబుతున్నా..పోలీసులు సరెండర్ చూపినా..ఫలితం మాత్రం ఆయుధాన్ని వీడి జనజీవనస్రవంతిలోకి వచ్చారు. 2024 నుంచి తెలంగాణ పోలీసుల ఎదుట 721 మంది లొంగిపోవడంతోపాటు 266 ఆయుధాలను అప్పగించారు. తెలంగాణకు చెందిన ఏడుగురు మావోయిస్టులు ఇంకా యాక్టివ్‌గా ఉన్నట్టు తెలంగాణ పోలీసులు ప్రకటించారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, గణపతి భార్య జోడే రత్నాబాయి, హనుమకొండ జిల్లా సోమిడికి చెందిన పసునూరి నరహరి అలియాస్ సంతోష్ , సికింద్రాబాద్‌కు చెందిన వార్త శేఖర్ , హైదరాబాద్‌కు చెందిన నక్క సుశీల అలియాస్ రేల, సిద్దిపేట జిల్లా మిర్‌దొడ్డికి చెందిన రంగబోయిన భాగ్య, భద్రాది జిల్లా తడపలకు చెందిన కుంజం ఇడ్మల్ ఉన్నారు.

**గణపతి లొంగుబాటుపై ఇప్పటికే తీవ్ర చర్చ..**

దేశాన్ని మావోయిస్టు రహితంగా ప్రకటించాలన్నా...అదేవిధంగా తెలంగాణ రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా ప్రకటించాలన్నా..అధికారిక రికార్డుల్లో ఉన్న మావోయిస్టులంతా అయితే లొంగిపోయారని, లేదంటే చనిపోయారని గుర్తించాల్సిందే. మావోయిస్టు అగ్రనేత, సుదీర్ఘ కాలం పాటు మావోయిస్టు ఉద్యమాన్ని నడిపించిన నేత, తెలంగాణలో జగిత్యాల జిల్లా బీర్పూర్‌కు చెందిన కీలక నేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి లొంగుబాటుపై ఇప్పుడు తీవ్రంగా చర్చ జరుగుతోంది. తెలంగాణ పోలీసులతోపాటు కేంద్ర ఇంటెలిజెన్స్, ఇతర దర్యాప్తు విభాగాలు సైతం గణపతి జాడ కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అయితే ఇటీవల లొంగిపోయిన దేవ్‌జీ, రాజిరెడ్డి సహా కేంద్ర కమిటీ సభ్యుల స్థాయిలో పని చేసిన వారు కూడా తమకు గణపతి జాడ తెలియదని చెబుతున్న నేపథ్యంలో గణపతి లొంగుబాటు సాధ్యమా..? లేదా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**మార్చి 31 తర్వాత పరిస్థితి ఏంటి?**

సాయుధ పోలీసు బలగాల నుంచి ఎదురవుతున్న తీవ్రమైన దాడులను ఎదుర్కోలేక మావోయిస్టు అగ్ర నాయకత్వం సైతం అడవులు వీడి లొంగుబాట పడుతున్నా..ఇంకా వందల మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నట్లు తెలుస్తోంది.అజ్ఞాతం వీడేందుకు కొందరు అంగీకరించడం లేదు. అయితే మార్చి 31 తర్వాత మిగిలే మావోయిస్టులపట్ల కేంద్రం వైఖరి ఎలా ఉంటుందన్నది వేచి చూడాలి. లొంగకపోతే మార్చి 31 తర్వాత మావోయిస్టుల ఏరివేత తప్పద న్న సంకేతాలే పంపుతున్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టుల కోసం మరోసారి గడువు పెంచుతారా..లేదా అనే విషయంలో మాత్రం స్పష్టత లేదు.

**నిషేధం ఎత్తివేత షరతు ఫలించేనా?**

తాము అజ్ఞాతం వీడి జనంలో జనం మధ్య, ప్రజల సమస్యలపై ప్రజాస్వామ్య విధానంలో పోరాటాలు చేస్తామని ఇప్పటికే లొంగిపోయిన ఎంతో మంది కేంద్ర కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. అయితే, మావోయిస్టు పార్టీపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని వారు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి మావోయిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేస్తే..అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులంతా ఆయుధాలు వీడి లొంగిపోయేలా తాము కృషి చేస్తామని చెబుతున్నారు.

# ముగిస్తాం.. విరుచుకుపడతాం

దుబాయ్

పశ్చిమాసియాలో యుద్ధ కల్లోలం చల్లారట్లేదు. ఓ వైపు అమెరికా-ఇజ్రాయెల్ విరుచుకుపడుతుంటే.. ఇరాన్ అంతే స్థాయిలో ప్రతిఘటిస్తోంది. శనివారం.. తమ దేశానికి దాదాపు 4 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రిటన్-అమెరికా సంయుక్త సైనిక స్థావరం డిగో గార్సియాపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి పాశ్చాత్య దేశాల్ని కలవరపాటుకు గురిచేసింది. ఈ దాడి యత్నం ద్వారా సుదీర్ఘ దూరంలోని లక్ష్యాలనూ ఢీ కొట్టగలమన్న సంకేతాన్ని పంపింది. మరోవైపు ఇరాన్‌లోని కీలక అణుశుద్ధి కేంద్రమైన నతాంజ్‌పై శనివారం అమెరికా బాంబుల వర్షం కురిపించింది. ఈ కేంద్రంపై గతేడాది జరిగిన 12 రోజుల యుద్ధంలోనూ అమెరికా తీవ్రస్థాయిలో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడులు.. ప్రతిదాడుల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. యుద్ధాన్ని ముగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తాము చేపట్టిన సైనిక చర్యలు అనుకున్న లక్ష్యానికి చేరువయ్యాయని చెప్పారు.
ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే.. వచ్చే వారం ఇరాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడతామంటూ ఇజ్రాయెల్ భిన్నమైన ప్రకటన చేయడం గమనార్హం. “ఇరాన్‌పై దాడులు మరింత ముమ్మరం కానున్నాయి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు.. ఆ దేశ పాలనాయంత్రాంగాన్ని, కమాండర్లను, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటాం. యుద్ధ లక్ష్యాలన్నీ సాధించే వరకు విశ్రమించేది లేదు” అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ పేర్కొన్నారు.
ముడి చమురు ధరల నియంత్రణపై దృష్టిపెట్టిన ట్రంప్ యంత్రాంగం ఇరాన్ చమురు విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ చమురుపై గతంలో విధించిన ఆంక్షలను తాత్కాలికంగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది.

**మరోసారి నతాంజ్‌పై..**

నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై వైమానిక దాడులు జరిగాయని ఇరాన్ శనివారం ప్రకటించింది. అయితే అణుకేంద్రం నుంచి ఎలాంటి రేడియేషన్ వెలువడలేదని పేర్కొంది. దాడి సమాచారాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)కు అందించినట్లు పేర్కొంది. అయితే తాము దాడి చేయలేదని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. అమెరికా చేసిందా లేదా అన్న విషయంపై స్పష్టతివ్వలేదు. నతాంజ్‌పై ఈ నెల తొలివారంలోనూ దాడి జరిగింది. ఈ అణుకేంద్రంపై దాడిని రష్యా ఖండించింది. ఇది అంతర్జాతీయ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమేనని పేర్కొంది.

**ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రం**

క్షిపణి సామర్థ్యాలను నాశనం చేశాం
ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ తన సొంత సామాజిక మాధ్యమం ‘ట్రూత్ సోషల్’ వేదికగా ట్రంప్ పోస్టు పెట్టారు. ఇరాన్‌పై సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నౌకా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు.

**ఆంక్షల ఎత్తివేత తాత్కాలికమే**

ఇరాన్‌పై తీవ్రస్థాయిలో దాడులు చేస్తున్న అమెరికా ఆ దేశ చమురుపై తాత్కాలికంగా ఆంక్షలను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 19 వరకు ఇరాన్ చమురును ఏ దేశమైనా దిగుమతి చేసుకోవచ్చని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. ఇప్పటికే నౌకల్లో ఉన్న ఇరాన్ చమురుకు మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుందని స్పష్టంచేశారు. యుద్ధం కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరలను నియంత్రించడానికి అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఆ నేపథ్యంలోనే ఇటీవల రష్యా చమురుపైనా ఆంక్షలు తాత్కాలికంగా ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. అమెరికా నిర్ణయంపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు చమురు లేదని స్పష్టం చేసింది. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకు, కొనుగోలుదారులకు భరోసా ఇవ్వడం కోసం అమెరికా ఈ ప్రకటన చేసిందని ఆరోపించింది.

**టెహ్రాన్, బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడులు**


ఇరాన్ రాజధాని టెహ్రాన్, లెబనాన్ రాజధాని బీరుట్‌లపై శనివారం ఇజ్రాయెల్ దాడులు నిర్వహించింది. సెంట్రల్ బీరుట్‌లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో ఇప్పటివరకు 1000 మంది ప్రాణాలు కోల్పోయారు. 10 లక్షల మందికి పైగా పౌరులు నిరాశ్రయులయ్యారు.
ఇజ్రాయెల్ తమ నిఘా కేంద్ర కార్యాలయంపై దాడి చేసి ఓ అధికారిని హతమార్చిందని ఇరాన్ పేర్కొంది. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు శనివారమూ కొనసాగాయి. టెహ్రాన్ క్షిపణి దాడిలో చిన్న పిల్లల పాఠశాల భవనమొకటి దెబ్బతిందని ఇజ్రాయెల్ పేర్కొంది. ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడించింది.
ఇజ్రాయెల్‌లోని దిమోనాపై ఇరాన్ శనివారం సాయంత్రం జరిపిన క్షిపణి దాడిలో 21 మంది గాయపడ్డారు. ఇరాన్ క్షిపణి నేరుగా ఓ భవంతిని తాకడంతో అది ధ్వంసమైంది.
బహ్రెయిన్ రాజధాని మనామాపై ఇరాన్ క్షిపణులు ప్రయోగించినట్లు తెలుస్తోంది. మనామాలో బాంబుల శబ్దాలు వినిపించాయని స్థానికులు పేర్కొన్నారు.
ఇరాన్ ప్రయోగించిన మూడు బాలిస్టిక్ క్షిపణులను, 8 డ్రోన్లను అడ్డుకున్నామని యూఏఈ రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది.
తమ చమురు క్షేత్రాలపైకి దూసుకొస్తున్న 20 డ్రోన్లను కూల్చినట్లు సౌదీ పేర్కొంది.
కొత్త సంవత్సర పండగైన నౌరోజ్ వేడుకలు జరుపుకోంటున్న ఇరానియన్లకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఎదురవుతున్న తీవ్రమైన పరీక్షలను ఇరాన్ గౌరవప్రదంగా అధిగమిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఇరాన్‌కు నమ్మకమైన స్నేహితుడిగా, విశ్వసనీయమైన భాగస్వామిగా మాస్కో ఉంటుందని తెలిపారు.
హర్మూజ్ జలసంధిపై దాడులు ఆపాలని బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, బహ్రెయిన్, యూఏఈ సహా 22 దేశాలు ఇరాన్‌కు శనివారం సూచించాయి. ప్రపంచ చమురు, సహజవాయువు సరఫరాలకు కీలకమైన ఈ జలసంధిని తెరవాలని విజ్ఞప్తి చేశాయి.

**లక్ష్యాన్ని చేరుకోని క్షిపణులు**

హిందూ మహా సముద్రంలోని బ్రిటన్-అమెరికా సంయుక్త సైనిక స్థావరమైన డిగో గార్సియాపై ఇరాన్ రెండు మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. ఈ స్థావరం.. ఇరాన్‌కు దాదాపు 4 వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు లక్ష్యాన్ని చేరలేదని సమాచారం. ఒక క్షిపణి మార్గం మధ్యలోనే విఫలమైంది. మరొకదాన్ని అమెరికా అడ్డుకుందని తెలుస్తోంది. ఈ దాడిని బ్రిటన్ తీవ్రంగా ఖండించింది. “పశ్చిమాసియా వ్యాప్తంగా దాడులు చేయడం, హర్మూజ్ జలసంధిని మూసివేయడం.. బ్రిటన్ ప్రయోజనాలకు, మా మిత్రులకు ముప్పు” అని బ్రిటన్ రక్షణ శాఖ పేర్కొంది. డిగో గార్సియాపై దాడి వివరాలను మాత్రం బ్రిటన్ అధికారులు వెల్లడించలేదు. యూఎస్ బాంబర్లు.. ఇరాన్‌పై దాడి చేయడానికి తమ వైమానిక స్థావరాలను వినియోగించుకోవచ్చని బ్రిటన్ శుక్రవారం తెలిపింది. దీనిపై ట్రంప్ స్పందించారు. బ్రిటన్ ఈ నిర్ణయాన్ని ఇంకా వేగంగా తీసుకోవాల్సిందని అన్నారు. బ్రిటన్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తీవ్రంగా స్పందించారు. బ్రిటన్ ప్రభుత్వం తన సొంత ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంలో భాగస్వామి అవుతోందని ఆయన విమర్శించారు. దీనివల్ల బ్రిటన్ ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు.

# కేరళలో మరోసారి షిగెల్లా కలకలం

కేరళలోని కోజికోడ్ జిల్లాలో షిగెల్లా వ్యాధి కలకలం రేపుతోంది. పెరువయల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎరంజికల్ ప్రాంతంలో తాజాగా మరో 12 మందికి షిగెల్లా సోకినట్లు నిర్ధరణ కావడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే కొద్ది రోజుల క్రితం నలుగురికి ఈ వ్యాధి నిర్ధరణ కాగా, వారిలో ఒక చిన్నారి మృతి చెందడం పరిస్థితిని మరింత తీవ్రమయ్యేలా చేసింది. తాజాగా నమోదైన కేసులతో మొత్తం బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆరోగ్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం, కొత్తగా పాజిటివ్ వచ్చిన వారిలో చాలా మంది ఇప్పటికే బాధితులైన వారి కుటుంబ సభ్యులే. దీంతో వ్యాధి ఒకే ప్రాంతంలో వేగంగా వ్యాప్తి చెందుతున్నట్టు అధికారులు భావిస్తున్నారు. ఇదే నేపథ్యంలో ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ యంత్రాంగం అప్రమత్తమై విస్తృత స్థాయిలో నివారణ చర్యలు చేపట్టింది. ఎరంజికల్, పూవట్టుపరంబ ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు మెడికల్ టీంలు ఇంటింటికీ వెళ్లి పరిశీలనలు నిర్వహిస్తున్నాయి. లక్షణాలు కనిపిస్తున్న వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే మరికొంతమంది అనుమానితులను ఆసుపత్రుల్లో చేర్చి, వారి నమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నారు.
వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో ఇంటింటికీ బావుల క్లోరినేషన్ కార్యక్రమం చేపట్టారు. తాగునీటి వనరులను శుభ్రపరిచే పనులు వేగవంతం చేశారు. అదనంగా, ఆహార భద్రతా శాఖ అధికారులు రంగంలోకి దిగారు. పరిశుభ్రత లేని పరిస్థితుల్లో పనిచేస్తున్న మూడు ఆహార దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన ఆహారం, తాగునీరు అందేలా కట్టుదిట్టమైన



చర్యలు తీసుకుంటున్నారు.
ఈ పరిస్థితిపై పెరువయల్ గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఆర్వీ జాఫర్ స్పందిస్తూ, షిగెల్లా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అత్యవసర సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈద్ రోజున కూడా ఆరోగ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి సమావేశమై చర్యలను సమీక్షించినట్టు చెప్పారు. పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో కూడా క్లోరినేషన్ పూర్తి చేసినట్టు వెల్లడించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై వివరాలు అందిస్తున్నారు. జ్వరము, విరేచనాలు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వ్యాధి వ్యాప్తికి అసలు కారణాలను తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యంగా తాగునీటి వనరుల నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. పిల్లలు కూడా బాధితుల్లో ఉండటంతో ఆరోగ్య శాఖ మరింత జాగ్రత్తలు తీసుకుంటోంది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేసి, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులను వెంటనే ఆసుపత్రులకు తరలించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం చేపట్టిన చర్యలతో వ్యాధి వ్యాప్తిని త్వరలోనే అదుపులోకి తీసుకురాగలమనే ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, పరిశుభ్రత పాటిస్తే షిగెల్లా వ్యాధిని సమర్థంగా నివారించవచ్చని ఆరోగ్య శాఖ సూచిస్తోంది.

**షిగెల్లా అంటే ఏంటి అసలు?**

షిగెల్లా అనేది బాక్టీరియా (సూక్ష్మక్రిములు) వల్ల కలిగే ఒక రకమైన అంటువ్యాధి, దీనిని షిగెల్లోసిస్ అని కూడా పిలుస్తారు. ఇది ప్రధానంగా జీర్ణవ్యవస్థను, ముఖ్యంగా ప్రేగులను ప్రభావితం చేస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ గురించి కొన్ని ముఖ్యమైన విషయాలు:
ఎలా వ్యాపిస్తుంది?: ఇది చాలా వేగంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. కలుషితమైన ఆహారం లేదా నీరు తీసుకోవడం ద్వారా, లేదా ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తిని తాకడం ద్వారా ఇది సంక్రమిస్తుంది.
ప్రధాన లక్షణాలు: విరేచనాలు (తరచుగా రక్తంతో కూడినవి), కడుపు నొప్పి, జ్వరం, మరియు వాంతులు వంటివి దీని ముఖ్య లక్షణాలు.
ఎవరికి ప్రమాదం?: ఇది ఏ వయసు వారికైనా రావచ్చు, కానీ సాధారణంగా 5 ఏళ్లలోపు పిల్లలలో ఎక్కువగా కనిపిస్తుంది.
ముందస్తు జాగ్రత్తలు: చేతులను శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం మరియు నీటిని తీసుకోవడం ద్వారా దీనిని నివారించవచ్చు.

# భారత వైఖరిని మోదీ చెప్పారు

**డెహ్రాడూన్:** పశ్చిమాసియాలో యుద్ధం గురించి ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన విషయం తెలిసిందే. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా పశ్చిమాసియాలో యుద్ధం గురించి స్పందించారు. ఉత్తరాఖండ్‌లో ఓ బహిరంగ సభలో పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా మాట్లాడారు. ‘చర్చలు, దౌత్యంతో సమస్యలను పరిష్కరించుకోవాలని మోదీ చెప్పారు. ప్రపంచం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మీకు తెలుసు, ప్రస్తుతం ప్రపంచంలో యుద్ధం జరుగుతోంది. పశ్చిమాసియాలో జరుగుతున్న దాడులు భారతదేశానికే కాదు మొత్తం ప్రపంచానికీ ఆందోళన విషయం. భారత్ తన వైఖరిని స్పష్టంగా తెలిపింది. యుద్ధానికి పరిష్కారం యుద్ధంతో లభించదని మోదీ చెప్పారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు దౌత్య ప్రయత్నాలు చేయాలి. ప్రధాని మోదీ ప్రయత్నానికి దేశ ప్రజలు మద్దతు ఇవ్వాలి’ అని అన్నారు. కాగా, యుద్ధం ముగింపు గురించి అమెరికా చెబుతున్న మాటలను ఇరాన్ నమ్మడం లేదు. ఇరాన్ ఐఎస్ఎన్ఏ వార్తా సంస్థకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆ దేశ అధికారి ఒకరు మాట్లాడుతూ.. అమెరికా సైనిక చర్యలు ముగింపు దశకు చేరవచ్చని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తాము నమ్మడం లేదని చెప్పారు. “ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ నమ్మడం లేదు. అమెరికా సైనిక కార్యకలాపాల్లో మార్పు కనపడడం లేదు. ట్రంప్ చేసిన ప్రకటన వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించడం లేదు. ఇప్పుడు ట్రంప్‌కు గుణపాఠం నేర్పాలని ఇరాన్ నిర్ణయించింది” అని అన్నారు. కాగా, శుక్రవారం ట్రంప్ ఇరాన్‌లో సైనిక చర్యలను ముగించే ఆలోచనలో ఉన్నానని చెప్పారు. కానీ, ఆ తర్వాత కాల్పుల విరమణ అమలు చేయాలని అనుకోవడం లేదని తెలిపారు.

## కూటముల కోలాటం

కేరళలో ఈ అసెంబ్లీ ఎన్నికలు అధికార వామపక్ష కూటమి ఎల్డీఎఫ్‌కు అగ్నిపరీక్షగా, కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష యూడీఎఫ్‌కు అస్తిత్వ పరీక్షగా మారాయి. దేశంలో మిగిలిన తమ ఏకైక కంచు కోటను వామపక్షాలు ఏ మేరకు కాపాడు కోగలవన్నది ఆసక్తికరం. కేరళలో ఐదేళ్లకోసారి పార?టలను గద్దె దింపే 40 ఏళ్ల ఆనవాయితీని బద్దలు కొడుతూ ఎల్డీఎఫ్ ఇప్పటికే వరుసగా రెండుసార్లు గెలిచింది. సీఎం పినరయి విజయన్ సారథ్యంలో ఈసారీ విజయ బావుటా ఎగరేసి రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా హ్యాట్రిక్ కొట్టాలని ఆశపడుతోంది. ఆ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించడం, ఇటు యూడీఎఫ్ కూటమిని, అటు రాష్ట్రంలో శరవేగంగా విస్తరిస్తున్న బీజేపీని నిలువరించడం అధికార కూటమికి అగ?నపరీక్షే కానుంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అధికార ఎల్డీఎఫ్ తమ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. సామాజిక భద్రత పెన్షన్ పథకం వంటివాటినే ప్రచారంలో ఎక్కువగా ప్రస్తావిస్తూ వస్తోంది. కానీ నిరుద్యోగం, ప్రజల్లో అసంతృప్తి, పదేళ్లుగా అధికారంలో ఉన్నందున ప్రభుత్వ వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. దాంతో ప్రజల్లో సీఎం విజయన్‌కు ఉన్న ఆదరణపైనే గట్టిగా ఆశలు పెట్టుకుంది. విపక్ష యూడీఎఫ్ మరో రకం సవాళ్లకు ఎదురీదుతోంది. వరుసగా రెండుసార్లు అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ కూటమి ఆర్థికంగా బాగా బలహీనపడింది. ఇది ప్రచారంపై గట్టి ప్రభావమే చూపుతోంది. ఈసారి నెగ్గని పక్షంలో కాంగ్రెస్, ఐయూఎంఎల్ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి. దాంతో యూడీఎఫ్ ఈసారి సర్వశక్తులూ ఒడ్డుతోంది. విజయన్ సర్కారు అవినీతిని ప్రధానాంశంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. నిరుద్యోగం తదితరాలనూ ప్రధానంగా ప్రస్తావిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకతపైనా గట్టిగానే ఆశలు పెట్టుకుంది. అయితే నేతల కుమ్ములాటలు కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారాయి. ఇక బీజేపీ కొన్నేళ్లుగా కేరళలో తన బలాన్ని, ప్రతి ఎన్నికల్లోనూ ఓట్ల శాతాన్ని క్రమంగా పెంచుకుంటూ వస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో శరవేగంగా విస్తరిస్తోంది. అధికార, విపక్ష కూటములకు మూడో ప్రత్యామ్నాయంగా ఎదుగుతోంది. ఎల్డీఎఫ్‌పై నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకత, యూడీఎఫ్ పక్షాల్లో అనైక్యతకు ప్రధాని మోదీ జనాకర్షణ శక్తి, హిందూత్వ కార్డు తోడై మెరుగైన ఫలితాలొస్తాయని బీజేపీ ఆశలు పెట్టుకుంది.

## ‘స్వేచ్ఛా నౌకాయానం, సముద్ర మార్గాల భద్రత ముఖ్యం’

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఇరాన్? అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్‌తో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఇరాన్ అధ్యక్షుడికి ఈద్?, నౌరోజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ సీజన్ పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛను కాపాడడం, సముద్ర రవాణా మార్గాలను సురక్షితంగా ఉంచడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. అంతేకాదు ఇరాన్?లో ఉన్న భారత పౌరుల భద్రతకు సంబంధించి అక్కడి ప్రభుత్వం అందిస్తున్న నిరంతర సహకారానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు.
“ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెస్కియాన్‌తో మాట్లాడి ఈద్, నౌరోజ్ శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ పండుగలు పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పుతాయని ఆశిస్తున్నాను. ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీసే మౌలిక సదుపాయాలపై దాడులను ఖండించాను.”

**దౌత్య సంబంధాలు**

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్?లు దాడులు చేయడంతో పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇరాన్? అధ్యక్షుడితో మోదీ మాట్లాడడం ఇదే రెండోసారి. అంతకు ముందు మార్చి 12న ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు. అప్పుడు ఇరాన్ అధ్యక్షుడు యుద్ధ పరిస్థితుల గురించి వివరించారు. అయితే భారత్ మొదటి నుంచి అన్ని సమస్యలను చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలని, ఇదే తమ స్థిరమైన విధానమని స్పష్టం చేస్తూ వస్తోంది. వాస్తవానికి పశ్చిమాసియా సంక్షోభం మొదలైనప్పటి నుంచి ప్రధాని మోదీ - సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్?, బహ్రెయిన్?, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా తదితర దేశాల నాయకులతో సంప్రదింపులు జరిపారు.

**వార్ ఎఫెక్ట్**

గత మూడు వారాలుగా ఇరాన్ వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్?ల మధ్య దాడులు, ప్రతిదాడులు నిరంతరాయంగా కొనసాగుతూ ఉన్నాయి. ముఖ్యంగా ఇరాన్ ప్రతీకార దాడులకు దిగి ఇజ్రాయెల్?తో సహా, తన పొరుగు దేశాల్లో ఉన్న అమెరికన్ మిలటరీ బేస్‌లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తోంది. అంతేకాదు ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతం మేర జరిగే హర్మూజ్ జలసంధిని తన నియంత్రణలోకి తీసుకుంది. దీనితో ప్రపంచవ్యాప్తంగా చమురు సహా మిగతా ఇంధన సమస్యలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ కొన్ని ఎంచుకున్న చమురు నౌకలను మాత్రమే హర్మూజ్ గుండా వెళ్లేందుకు అనుమతి ఇస్తోంది.

**ఇరాన్ ప్రస్తుత పరిస్థితి ఏమిటి?**

అలీ ఖమేనీ మృతి తర్వాత, ఆయన కుమారుడు మోజ్తబా ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యారు. ఆయన కూడా యుద్ధ రంగంలో తగ్గేది లేదంటున్నారు. అందుకే అమెరికా, ఇజ్రాయెల్?పై ప్రతీకార దాడులు కొనసాగిస్తున్నారు. దీనితో యుద్ధం మరింత తీవ్రమవుతోంది. మరోవైపు ఇరాన్?లోని అత్యంత కీలకమైన నతాంజ్ యురేనియం శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్?లో సంయుక్తంగా వైమానిక దాడులు జరిపాయి. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ తస్నిమ్? ధ్రువీకరించింది. అయితే ఈ దాడి తర్వాత ఎలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువడలేదని పేర్కొంది. కనుక అణుకేంద్రం సమీపంలో నివసించే ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని అధికారులు తెలిపారు. ఇంతకు ముందు అంటే గురువారం ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ ద్రవీకరణ కేంద్రమైన ఖతార్?లోని రాస్ లఫ్ఫాన్? పారిశ్రామిక నగరంపై ఇరాన్? బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. దీనితో తమ దేశ ఎల్ఎన్‌జీ ఎగుమతి సామర్థ్యం 17 శాతం మేర పడిపోయిందని, తమకు భారీ నష్టం వాటిల్లిందని ఖతార్ రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది.

## అమెరికాకు ఆ అవకాశం ఇస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయ్..

పశ్చిమాసియాలో యుద్ధం భీకరంగా సాగుతోంది. అమెరికా-ఇజ్రాయెల్ దేశాలు మిస్సైల్‌లు, డ్రోన్‌లతో ఇరాన్ పై విరుచుకుపడుతున్నాయి. ఇరాన్ తనచుట్టూ ఉన్న దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన, ఇజ్రాయెల్‌పైన భీకర దాడులు చేస్తున్నది. ఈ ఉద్రిక్తతల నడుమ ఇరాన్, బ్రిటన్ కు తీవ్రమైన హెచ్చరికలు చేసింది. తమపై దాడుల కోసం అమెరికా దళాలకు బ్రిటన్ తన సైనిక స్థావరాలను ఉపయోగించుకునే అవకాశం ఇస్తుందనే వార్తల నేపథ్యంలో ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఈ వివాదంలో బ్రిటన్ జోక్యం శ్రుతి మించితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ హెచ్చరించారు. ఈ మేరకు అరాఘ్చీ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. ‘ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న ఈ యుద్ధంలో భాగం కావాలని బ్రిటన్ ప్రజల్లో అధిక శాతం మంది కోరుకోవడం లేదు. కానీ వారి ప్రధాని స్టార్మర్ మాత్రం సొంత ప్రజల అభిప్రాయాన్ని విస్మరించి, ఇరాన్‌పై దాడికి యూకే స్థావరాలను వినియోగించుకునే అవకాశం ఇస్తున్నారు. తద్వారా ఆయన బ్రిటిష్ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మరక్షణ హక్కును వినియోగించుకోవడానికి ఇరాన్ వెనుకాడదు’ అని అరాఘ్చీ తన పోస్టులో వార్నింగ్ ఇచ్చారు. ఈ వివాదం తమది కాకపోయినా బ్రిటన్ అనవసరంగా తలదూరుస్తోందని పరోక్షంగా మండిపడ్డారు. ఈ అంశంపై ఇరాన్ అధికారికంగా కూడా తన ఆందోళనను బ్రిటన్‌కు తెలియజేసింది.

## సంపాదకీయం

# నీటి పరిరక్షణ సామాజిక బాధ్యత

నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారము. ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపరూపమైన పదార్థము. మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో నీరూ అంతే అవసరం. నీరే లేకపోతే పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహాసముద్రాలు ఏమీ ఉండవు. ఇవేమీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి. భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. అంతటి అమూల్యమైన నీటి విలువను తెలుసు కోడానికి, దానిని వృథా చేయకుండా అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి 1993 నుంచి ప్రతి సంవత్సరం మార్చి 22న అంతర్జాతీయ జల దినోత్సవంగా గుర్తించాలని నిర్ణయించింది. ఐక్య రాజ్య సమితి, ప్రపంచ జల దినోత్సవాన్ని 1992 యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, రియో డి జెనీరియో సమావేశంలో ప్రతిపాదించింది. దీన్ని 1993వ సంవత్సరం నుంచి నిర్వహించడం ప్రారంభించారు. మెరుగైన మంచి నీటి వనరుల నిర్వహణ, ప్రాముఖ్యత పట్ల అవగాహనా కల్పించడం కోసం ఐక్య రాజ్య తెలంగాణ ప్రతి సంవత్సరం మార్చి 22ను ప్రపంచ జల దినోత్సవంగా జరుపుతుంది. భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. మన చరిత్రంతా జలవనరుల తోనే ముడిపడి ఉంది. నీటిని పరిరక్షించు కోవాలనే నినాదాన్ని ప్రాచీన నాగరికతలు వెల్లడించాయి. భారతీయులకు నీటి విలువ తెలుసు కనుకే నదులను పూజించే ఆచారం ఉంది. నీటిని పూజించి, నదులకు, చెరువులకు, జలాశయాలకు హారతులిస్తారు. నారం అంటే నీరు. నీటిలో ఉంటాడు కాబట్టి శ్రీమహావిష్ణువుకు నారాయణుడు అని పేరు. నీటినే రూపంగా స్వీకరించి విష్ణువు నీటి విలువను చెప్తున్నాడు. శివుడు ఏకంగా గంగను తన తలపై ధరించి గంగాధరుడయ్యాడు. నీటినివృథా చేయడం సృష్టికి, భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకమని పురాణాలు, ప్రాచీన గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. నీరు మూడు రూపాలలో... ఘన రూపం అంటే మంచు గడ్డల రూపంలోను, ద్రవ రూపం, సముద్రాలు, నదులు, తటకములు మొదలగునవి, వాయు రూపంలో భూమండలం పై 71 శాతానికి పైగా ఆవరించి ఉంది. క్రొత్త క్రొత్త సమ్మేళన పదార్థముల తోను, విష పూరిత రసాయన పదార్థాల తోను నీరు కలుషిత మౌతున్నది. అలా కలుషితమైన జలము జల చక్రము ద్వారా తిరిగి ఆవిరి రూపం ధరిస్తుంది. ఈ క్రమంలో ఆ జలం తనలోని ఇతర కలుషిత పదార్థములను, అనగా రసాయన పదార్థములను కూడా కలుపుకొని వాయు రూపంలో మేఘాలుగా మారి అక్కడి వాతావరణం అనుకూలించ గానే ద్రవించి తిరిగి వర్ష రూపంలో తిరిగి భూమిని చేరుతున్నది. ఆ కలుషిత మేఘాలు వర్షించినపుడు రంగులలో వర్షము కురవడము, ఆమ్ల వర్షాలు కురవడము సర్వ సాధారణము. దాంతో ప్రకృతికి అపార నష్టము జగురుతున్నది.జీవ వ్యవస్థలో నీరు మంచి ద్రావణి, ఇందులో చాలా వరకు లవణాలు కరుగుతాయి. అందుకే దాన్ని విశ్వవ్యాప్త దావణి అంటారు. ఇంచుమించు అన్ని జీవ రసాయనాలు నీటిలో కరుగుతాయి. ఇందువల్ల నీరు జీవ పదార్థాల రవాణాకు తోడ్పడుతుంది. నీటి ఎద్దడిని ప్రపంచంలో 80 దేశాలు ఎదుర్కొంటున్నాయి. గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచి పోవాల్సిన పరిస్థితిలో కూడా ప్రజలు ఉన్నారు. మంచి నీల్లు దొరకక కుంటల్లో, గుంటల్లో అడుగు బొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితిలో ఎంతో మంది ఉన్నారు. వేసవిలో చాలా చోట్ల నీటి కొరత మూలంగా, కనీసం తాగు నీరు దొరకక ఎంతో మంది బిందెలతో బహు దూరం కిలో మీటర్ల వరకు నడిచి వెళ్లి త్రాగు నీటిని తెచ్చుకునే అనివార్య పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. మంచినీటి కంటే సముద్రపు నీరు చాలా ఎక్కువ పరిమాణంలో ఉంది. మనం నివసించే భూగోళంలో ఉన్న నీటి వనరులలో 99% ఉన్నది ఉప్పునీరే. ఇది 97% సముద్రాల్లోనే ఉంది. మిగతాది నదులు, చెరువుల్లో ఉంది త్రాగడానికి పనికొచ్చే నీరు 1% మాత్రమే. ఇందులో చెరువుల్లో 0.86%, నదుల్లో 0.02% ఉండగా మిగిలినవి భూగర్భ జలాలు. ప్రపంచ వ్యాప్తంగా త్రాగడానికి ఉపయోగపడే నీరు 0.3% మాత్రమే. నీటితో జీవం అంకురించింది. ప్రకృతి మనుగడ నీటితోనే కొనసాగుతోంది. జీవవైవిధ్య పరిరక్షణ. జీవం జలంతోనే సాధ్యమవు తుంది. ఇవన్నీ తెలిసినా..నీటిని వృథా చేస్తున్నాం..నీటి వనరుల్ని వ్యర్థాలతో కలుషితం చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుం టే..మనకు అందుబాటులో ఉన్న నీటిని వృథా చేస్తున్నాం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన నీరు ఉండనే ఉండదని. ప్రజలు స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు రాసుకుంటారనీ..(కెమికల్ బాత్) వాటితోనే స్నానాలు చేస్తారనీ..దేశ సరిహద్దుల్లో కాపలా కాయాల్సిన సైనికులు నీటి వనరుల చుట్టు కాపలా కాసా పరిస్థితి ఉంటుందని.. తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారనీ, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చు. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసు కోవడం, వృథాను అరికట్టడం, పొదుపుగా వాడటం, పునర్వి నియోగం..తదితరాలన్నింటికీ ప్రాధాన్య మివ్వాలి.

# మంచినీటి ఊటలు.. పర్యావరణహిత గ్లేసియర్స్

జీవులకు ప్రాణాధారం జలం. భూగృహంపై జీవకోటి ఉనికికి కారణం ద్రవరూపంలో ఉన్న నీరు మాత్రమే. అతి ముఖ్య సార్వత్రిక ద్రావణిగా జలధారలు భూఉపరితలంపై నిరంతరం ప్రవహిస్తానే ఉన్నాయి. భూమిపై ఉన్న జల సంపదలో అత్యధిక మొత్తం సముద్ర జలం రూపంలో లేదా హిమానీనదాలు లేదా గ్లేసియర్స్ రూపంలో ఉండడంతో పాటు కేవలం 3 శాతం మాత్రమే మంచి నీటి జలంగా మానవాళికా అందుబాటులో ఉంటున్నది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి తీవ్రమైన నీటి కొరత లేదా నీటి ఒత్తిడిని అనుభవిస్తున్నది. నేడు మార్కెట్‌లో నీటిని పాల వలె అధిక ధరలకు కొనుక్కోవలసిన అగత్యం ఏర్పడింది. రానున్న కొన్ని దశాబ్దాల్లో నీటి కొరత ఎక్కువై దేశాలు, ప్రాంతాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో దాదాపు 2.2 బిలియన్ల ప్రజలకు సురక్షిత నీరు అందడం లేదు. రాను రాను నీటి కొరత పెరిగి గొంతులు ఎండిపోయే ప్రమాదం కూడా ఏర్పడనుందని అర్థం అవుతున్నది. మంచి నీటి వనరుల్లో నదులు, చెరువులు, సరస్సులు, వాగులు వంకలు, భూగర్భ జలాలు లాంటి నీటి నిల్వలు వస్తాయి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-6 ప్రకారం "2030 నాటికి అందరికీ నీరు - పారిశుద్ధ్యం" అనే లక్ష్యం సుసాధ్యం అయ్యేట్లుగా కనిపించడం లేదు. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ - పరిశ్రమలకు నీటి అవసరాలు పెరగడంతో రానున్న రోజుల్లో ప్రపంచ మానవాళి నీటి ఒత్తిడి సంక్షోభంలో పడే విధంగా కనిపిస్తున్నది. తాగు నీరు, సాగు నీరు, పరిశ్రమలు, జన విద్యుత్ కేంద్రాలు, ఉత్పత్తి రంగాలు జల వనరులను అత్యధికంగా వినియోగించుకుంటున్నాయి. ప్రాణికోటి మనుగడకు కారణమైన నీటి కొరతను అధిగమించడానికి ప్రజలకు నీటి ఆవశ్యకత పట్ల తగు అవగాహన పెంచాల్సిన అవసరం ఏర్పడుతున్నదని గమనించిన ఐరాస ప్రతి ఏట 22 మార్చిన "ప్రపంచ నీటి దినోత్సవం లేదా వరల్డ్ వాటర్ డే"ను 1993 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది. నేటి పర్యావరణ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పులు, కార్బన్ ఉద్గారాల పెరగడం, హరిత గృహ వాయువులు అధికం కావడం, భూతాపం పెరగడం లాంటి కారణాలతో హిమానీనదాలు లేదా గ్లేసియర్లు వేగంగా కరుగుతూ తరుగుతూ రానున్న ప్రమాద హెచ్చరికగా మారనున్నాయి. గ్లేసియర్లు వేగంగా కరగడం వల్ల సముద్ర మట్టాలు పెరగడం జరిగి మానవాళికా మరో ప్రమాద ఘంటికలు మోగించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. హిమానీనదాల పరిరక్షణ కేంద్రంగా నేటి మానవాళి తన దృష్టిని పెట్టవలసి ఉందనే విషయాన్ని పరిగణలోకి తీసుకొని 2026 ప్రపంచ నీటి దినం ఇతివృత్తంగా "వాటర్ అండ్ జెండర్ - నీటి ప్రవాహంతో లింగ సమానత్వం" అనబడే అంశం కేంద్రంగా అవగాహన కలిపించడం జరుగుతున్నది. హిమానీనదాల పరిరక్షణే ఏకైక లక్ష్యంగా చేసుకొని 2025 ఏడాదిని "అంతర్జాతీయ హిమానీ నదాల సంవత్సరం"గా కూడా ప్రకటించు తగు ప్రచార కార్యక్రమాలను నిర్వహించుటకు భారీ ఏర్పాట్లు చేయడం జరిగింది. అదే విధంగా ప్రప్రథమంగా 2025, మార్చి 21న "ప్రపంచ గ్లేసియర్స్ దినం" కూడా నిర్వహించడం జరిగింది. క్రియోస్ఫియర్, వాతావరణ మార్పులు, నీటి చక్రం, ఆర్థికాభివృద్ధి, పర్యావరణం, పౌర సమాజాల మధ్య నెలకొని ఉన్న సంబంధాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతున్నది. నీరు ద్రవ రూపంలో కాకుండా ఘన మంచు రూపంలో అధికంగా ఉన్నపుడు దాని ప్రతికూల ప్రభావం భూమిపై పడుతుంది. దీనితో పాటు 2025-34 దశాబ్దాన్ని కూడా "క్రియోస్ఫియరిక్ సైన్సెస్ చర్యల దశాబ్దం"గా ప్రకటించడం జరిగింది. ఇదే క్రమంలో నీరు - పారిశుద్ధ్యాలకు సంబంధించిన నివేదికను "వాటర్ టవర్స్ : మౌంటేన్స్ అండ్ గ్లేసియర్స్" అనబడే పేరుతో విడుదల చేయడం జరిగింది.భూతాపం పెరిగిన కొద్ది హిమానీనదాలు క్రమంగా, వేగంగా కరుగుతూ తరిగిపోతున్నాయి. అధిక మొత్తంలో హిమానీనదాలు కరిగితే వరదలు, కొండచరియలు విరిగి పడడం, సముద్ర మట్టాలు పెరగడం, కరువు కాటకాలు రావడం, జీవ వ్యవస్థల్లో లోపాలు జరగడం లాంటి ప్రతికూలాలు అనుభవంలోకి వస్తాయి. 2023లో గ్లేసియర్స్ కరగడం వల్ల 600 గీగాటన్నుల నీరు వ్యర్థంగా ప్రవహిస్తున్నది. భూగోళంపై ఉన్న మంచి నీటిలో 70 శాతం వరకు మంచు రూపంలోనే ఉంటున్నది. గ్లేసియర్స్ కరగడంతో 1900 నుంచి నేటి వరకు దాదాపు 20 సెమీ సముద్ర మట్టం పెరగడం గమనించారు. భూతాపాన్ని తగ్గిస్తేనే గ్లేసియర్స్ కరిగే వేగం అదుపు చేయబడి ఉంటుందని తెలుసుకోవాలి. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ నివేదిక "సహజ వనరుల కొరత" ఆధారంగా విడుదల చేయబడింది. రానున్న రోజుల్లో అతి ముఖ్యమైన కొరత ప్రమాదాల్లో 4వ స్థానం నీటి ఒత్తిడి గుర్తించబడింది. నీరు తాగడానికి, పారిశుద్ధ్యానికి, వ్యవసాయానికి, పరిశ్రమలకు మాత్రమే కాకుండా పర్యావరణ సమతుల్యత కాపాడడంలో కూడా ఉపయోగపడుతుంది. ప్రపంచ నీటి దినం వేదికగా నీటి వనరులను కాపాడడంతో పాటు హిమానీనదాల వేగవంతమైన కరగడాన్ని కూడా తగ్గించడానికి ప్రజలకు పలు మార్గాల్లో ప్రచారాలు పెద్ద ఎత్తున నిర్వహించాల్సింది ఉన్నది. సహజ వనరైన నీటిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, నీటిని ఆదా చేస్తూ, హిమానీనదాలను రక్షించుకుంటూ రాబోయే తరాలకు సుజల వాతావరణం కల్పిద్దాం, నీటిని చుక్క చుక్క సద్వినియోగం చేసుకుందాం.

# శాస్త్రోక్తంగానే సీతారాముల కల్యాణం



భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం కేవలం ఒక ధార్మిక వేడుక మాత్రమే కాదు, అది తరతరాల సంప్రదాయానికి, అచంచలమైన భక్తికి మరియు శాస్త్రబద్ధమైన ఆచారాలకు నిలువుటద్దం. ఇటీవలి కాలంలో ఈ మహోత్సవంలో పఠించే 'ప్రవర' విషయంలో తలెత్తిన చర్చలు కేవలం ఆధ్యాత్మిక పరిధులకే పరిమితం కాకుండా, న్యాయస్థానం వరకు చేరడం ఈ అంశం యొక్క గాంభీర్యాన్ని చాటిచెబుతోంది. భద్రాద్రి రాముడిని 'దశరథ తనయుడిగా' సంబోధించాలా లేక 'రామనారాయణుడిగా' కీర్తించాలా అనే ప్రశ్న చుట్టూ జరుగుతున్న ఈ మథనం, సంప్రదాయం మరియు అధికారిక నిర్ణయాల మధ్య ఉన్న ధర్మ సూక్ష్మాన్ని ఎత్తిచూపుతోంది. ఈ నెల 23న హైకోర్టులో జరగబోయే విచారణ, తదనంతరం 27న నిర్వహించ తలపెట్టిన కల్యాణోత్సవం నేపథ్యంలో, భక్తులలో నెలకొన్న ఉత్కంఠ, ఈ వివాదంలోని శాస్త్రీయ కోణాల గురించి తీవ్ర చర్చలు చోటుచేసుకుంటున్నాయి. తెలుగువారి ఆరాధ్య దైవం, మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుడు కొలువైన భద్రాచలం కేవలం ఒక పుణ్యక్షేత్రం మాత్రమే కాదు; అది తరతరాల భక్తి పరంపరకు, అచంచలమైన విశ్వాసానికి మరియు శాస్త్రబద్ధమైన ఆచారాలకు ఒక సజీవ సాక్ష్యం. ప్రతి ఏటా చైత్ర శుద్ధ నవమి నాడు భద్రాద్రిలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం లోకకల్యాణానికి ప్రతీకగా నిలుస్తుంది. అయితే, ఇటీవలి కాలంలో ఈ మహోత్సవంలో పఠించే 'ప్రవర' విషయంలో తలెత్తిన చర్చలు కేవలం ఆధ్యాత్మిక పరిధులకే పరిమితం కాకుండా, సామాజిక ఆందోళనకు మరియు న్యాయస్థాన విచారణకు దారితీశాయి. భద్రాద్రి రాముడిని 'దశరథ తనయుడిగా' సంబోధించాలా లేక 'రామనారాయణుడిగా' కీర్తించాలా అనే ప్రశ్న చుట్టూ జరుగుతున్న ఈ మథనం, ప్రాచీన సంప్రదాయాలకు మరియు ఆధునిక పాలనా నిర్ణయాలకు మధ్య ఉన్న ఒక సున్నితమైన ధర్మ సూక్ష్మాన్ని ఎత్తిచూపుతోంది. ఈ వివాదాన్ని లోతుగా విశ్లేషిస్తే, ఇందులో దాగి ఉన్న చారిత్రక సత్యాలు, ఆగమ శాస్త్ర రహస్యాలు మరియు భక్తుల భావోద్వేగాల మేళవింపు స్పష్టమవుతుంది. భద్రాచలం క్షేత్ర చరిత్రను పరికిస్తే, ఇది 17వ శతాబ్దంలో భక్త రామదాసుగా ప్రసిద్ధి చెందిన కంచర్ల గోపన్న అకుంఠిత దీక్షతో రూపుదిద్దుకున్న అద్భుత ఆధ్యాత్మిక నిలయం. రామదాసు కాలం నుండి నేటి వరకు సీతారాముల కల్యాణం ఒక నిర్దిష్టమైన పద్ధతిలో, వాల్మీకి రామాయణోక్తమైన రీతిలో జరుగుతూ వస్తోంది. వైకుంఠ రాముడిగా, శంఖుచక్రాలతో వెలసిన ఈ స్వామికి కల్యాణం జరిపించే సమయంలో 'ప్రవర' పఠనం అత్యంత కీలకమైన ఘట్టం. హైందవ వివాహ సంప్రదాయంలో ప్రవర అంటే కేవలం వంశవృక్షం కాదు; అది వధూవరుల ఋషి పరంపరను, గోత్రాన్ని, వేద శాఖను మరియు వారి పూర్వీకుల ఘనతను ప్రకటించే ఒక పవిత్ర సంకల్పం. వివాహ వేదికపై వరుడు తన వంశ మూలాలను ప్రకటించడం ద్వారా ఆ సంస్కారానికి ఒక అధికారికత, శాస్త్రబద్ధత చేకూరుతుంది. భద్రాద్రి కల్యాణంలో రాముడి ప్రవరను పఠించేటప్పుడు ఆయనను సూర్యవంశ సంజాతుడిగా, ఇక్ష్వాకు వంశమణిగా, దశరథ మహారాజు కుమారుడిగా అభివర్ణించడం తరతరాలుగా వస్తున్న ఆచారం. అయితే, గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రవరలో 'రామనారాయణ' అనే పదప్రయోగాన్ని చేర్చడం వివాదానికి కేంద్రబిందువైంది. సంప్రదాయ పండితులు, ఆగమ శాస్త్ర నిపుణులు మరియు హిందూ సంఘాల వాదన ప్రకారం, శ్రీరాముడు విష్ణువు యొక్క అవతారమే అయినప్పటికీ, ఆయన 'నర' రూపంలో అవతరించిన పురుషోత్తముడు. రామాయణ అంతరార్థం ప్రకారం రాముడు తనను తాను ఒక సామాన్య మానవుడిగా (ఆత్మానం మానుషం మన్యే) భావించుకుంటూ ధర్మాన్ని ఆచరించి చూపారు. వివాహ సమయంలో వరుడు తన తండ్రి, తాతల పేర్లను చెప్పడం శాస్త్రం. రాముడు దశరథుని కుమారుడిగా భూమిపై జన్మించినప్పుడు, ఆయన వివాహ ప్రవరలో 'దశరథ తనయుడు' అని ఉండాలి తప్ప, దైవత్వపు 'నారాయణ' నామాన్ని చేర్చడం సంప్రదాయ విరుద్ధమని వారు గట్టిగా వాదిస్తున్నారు. ఒక పదం మారినా అది ఆ వివాహ సంస్కారంలోని భావాన్ని, ప్రాచీనతను దెబ్బతీస్తుం దని, శతాబ్దాల నాటి రామదాసు సంప్రదాయాన్ని మార్చే హక్కు ఎవరికీ లేదని వారు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు, దేవాదాయ శాఖ అధికారులు మరియు కొందరు అధికారిక ఆగమ సలహాదారులు ఈ మార్పును సమర్థిస్తున్నారు. భద్రాద్రిలో వెలసిన స్వామి వైకుంఠ రాముడని, ఆయన చేతిలో శంఖుచక్రాలు ఉన్నాయని, కావున ఆయనను 'నారా యణ' స్వరూపంగా ప్రవరలో పేర్కొనడంలో తప్పేముందని వారు ప్రశ్నిస్తున్నారు. భక్తులకు పరమాత్మ యొక్క సర్వవ్యాపకత్వాన్ని తెలియజేయడమే దీని వెనుక ఉన్న ఉద్దేశమని వారి అభిప్రాయం. అయితే, ఈ వాదన పండిత లోకంలో ఆమోదం పొందడం లేదు. విగ్రహ స్వరూపం ఏదైనప్పటికీ, కల్యాణ ఘట్టం అనేది రామాయణ ఇతివృత్తం ఆధారంగా జరుగుతుందని, అక్కడ దశరథ తనయుడిగానే రాముడు ఉండాలని వారు గుర్తుచేస్తున్నారు. ఈ తర్క వితర్కాల మధ్య వివాదం ముదిరి, చివరకు న్యాయస్థానం మెట్లు ఎక్కడం గమనార్హం. ఈ వివాదంలో సామాజిక కోణాన్ని కూడా విస్మరించలేం. భద్రాచలం కల్యాణం అనేది కేవలం ఒక ప్రాంతానికి చెందినది కాదు. కోట్లాది మంది తెలుగువారు తమ ఇంట్లో జరుగుతున్న వేడుకగా దీనిని భావిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించే ఈ ఉత్సవంలో, అచారపరమైన లోపాలు దొర్లడం భక్తుల మనోభావాలను గాయపరుస్తోంది. సోషల్ మీడియా వేదికలపై భక్తులు ఈ అంశంపై తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. న్యాయస్థానంలో మార్చి 23న జరగబోయే విచారణపై అందరి దృష్టి నెలకొంది. సంప్రదాయాన్ని యథాతథంగా కొనసాగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై కోర్టు ఇచ్చే తీర్పు, 27న జరిగే కల్యాణోత్సవంపై ప్రభావం చూపనుంది. పాలనాపరమైన నిర్ణయాలు ధార్మిక ఆచారాల్లో జోక్యం చేసుకోకూడదని, ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని భక్తులు గుర్తుచేస్తున్నారు.

ప్రవర వివాదం కేవలం ఒక పేరు మార్పు మాత్రమే కాదు; అది మన సంస్కృతి యొక్క ప్రామాణికతను కాపాడుకోవడానికి జరుగుతున్న ఒక గొప్ప మథనం. సనాతన ధర్మంలో ప్రతి ఆచారం వెనుక ఒక శాస్త్రీయ కారణం ఉంటుంది. ఆ కారణాన్ని విస్మరించి, కాలానుగుణంగా లేదా స్వతంత్ర నిర్ణయాలతో మార్పులు చేస్తే, ఆచారాల పవిత్రత దెబ్బతింటుంది. ప్రభుత్వం నియమించిన పండిత కమిటీలు మరియు న్యాయస్థానం ఈ విషయంలో లోతైన అధ్యయనం చేసి, ప్రాచీన గ్రంథాల ఆధారంగా ఒక స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే, శాస్త్రీయతను కాపాడుకోవడం ద్వారానే మన వారసత్వం చిరస్థాయిగా నిలుస్తుంది. ముగింపుగా, భద్రాద్రి రాముని కల్యాణం ఎప్పటిలాగే సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా జరిగి లోకానికి శాంతిని చేకూర్చాలని తెలుగు లోకం కోరుకుంటోంది. 'రామ' నామమే ఒక తారక మంత్రం; ఆ నామానికి మరే ఇతర విశేషణాలు అవసరం లేదు. భక్తుల విశ్వాసాన్ని గౌరవించి, శతాబ్దాల నాటి రామదాసు ఆచారాలను యథాతథంగా కొనసాగించడం ద్వారానే ఆ క్షేత్ర గౌరవం పెరుగుతుంది. న్యాయస్థానం వెలువరించే తీర్పు ధర్మానికి అనుగుణంగా ఉండాలని, భద్రాద్రి కల్యాణ వేదికపై దశరథ తనయుడైన ఆ రామచంద్రుని ప్రవర స్పష్టంగా, సంప్రదాయబద్ధంగా వినిపించాలని ఆశిద్దాం. అప్పుడే ఈ 'ప్రవర మథనం' సుఖాంతమై, భక్తి భావం వెల్లివిరుస్తుంది. రామదాసు కీర్తనలు ప్రతిధ్వనించే ఆ పుణ్యనేలపై, శాస్త్రం గెలవాలి, సంప్రదాయం నిలవాలి.



# ఎండల్లో చలచల్లగా ఉంచే డ్రింక్స్

వేసవి తాపం నుంచి శరీరాన్ని కాపాడుకోవడానికి చాలా మంది నీటి శాతం ఎక్కువగా ఉండే కాలానుగుణ పండ్లు, ఆకుకూరలను తింటారు. అంతేకాకుండా కొన్ని పానీయాలను తీసుకోవడం ద్వారా కూడా వేసవి అలసటను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. వేసవిలో తీవ్రమైన వేడి కారణంగా డీహైడ్రేషన్, అలసట, నీరసం, ఒళ్ళు నొప్పులు, వడదెబ్బ, జీర్ణ సమస్యలతో సహా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందువల్ల ఈ సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అదనపు శ్రద్ధ వహించాలి. కాబట్టి ఈ సమస్యల నుంచి శరీరాన్ని కాపాడుకోవడానికి చాలా మంది నీటి శాతం ఎక్కువగా ఉండే కాలానుగుణ పండ్లు, ఆకుకూరలను తింటారు. అంతేకాకుండా కొన్ని పానీయాలను తీసుకోవడం ద్వారా కూడా వేసవి అలసటను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. వేసవిలో దాహాన్ని తీర్చడానికి నిమ్మ షర్బత్ ఒక మంచి మార్గం. దీనిలోని విటమిన్ సి, ఎలక్ట్రోలైట్లు తక్షణ శక్తిని అందించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా పచ్చి మామిడితో చేసిన ఆమ్ పన్నాను కూడా తీసుకోవచ్చు. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ సి, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని చల్లబరచడమే కాకుండా వడదెబ్బ నుంచి రక్షించడంలో కూడా సహాయపడతాయి. వేసవిలో శరీరాన్ని చల్లబరచడానికి పుదీనా, దోసకాయతో చేసిన పానీయం తాగడం ఉత్తమం. ఈ రెండింటిలోనూ నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరాన్ని ఎక్కువ సేపు హైడ్రేటెడ్‌గా ఉంచడానికి సహాయపడుతుంది. ఇది శరీరానికి పోషణను అందించడమే కాకుండా వేడి నుంచి ఉపశమనాన్ని కూడా ఇస్తుంది. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు వంటి అనేక ముఖ్యమైన మూలకాలు ఉంటాయి. ఇవి శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటానికి సహాయపడతాయి. కాబట్టి వేసవిలో రోజుకు ఒకసారి కొబ్బరి నీళ్ళు తాగడం వల్ల శక్తి స్థాయిలను కాపాడుకోవడానికి సహాయపడుతుంది.వేసవి కాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాలలో చెరకు రసం ఒకటి. ఇందులో గ్లూకోజ్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ వంటి అనేక ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి.ఈ వేసవిలో మజ్జిగ తాగడం కూడా చాలా మంచిది. ఇది కడుపుకు చల్లదనాన్ని, తాజాదనాన్ని ఇస్తుంది. మజ్జిగ శరీరాన్ని చల్లబరచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఎసిడిటీ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేసవిలో అత్యంత ముఖ్యమైన విషయం పుష్కలంగా నీళ్లు తాగడం మంచిది. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ప్రతిరోజూ సుమారు రెండున్నర నుంచి మూడు లీటర్ల నీళ్లు తాగాలి. శారీరక శ్రమ చేసేవారు ఇంకా ఎక్కువ నీళ్లు తాగాల్సి ఉంటుంది.

# చెరుకు, పుచ్చకాయ రసం.. సమ్మర్‌లో ఆరోగ్యానికి ఏది మంచిది..?




వేసవి కాలం తన ప్రతాపాన్ని చూపిస్తోంది. శరీరంలోని నీటి శాతం తగ్గిపోకుండా ఉండాలంటే కేవలం నీళ్లు తాగితే సరిపోదు, సరైన పోషకాలు కూడా అందాలి. మార్కెట్లో అందరికీ అందుబాటులో ఉండే చెరకు రసం తక్షణ శక్తిని ఇస్తుందా..? లేక 90శాతం నీటి శాతం ఉండే పుచ్చకాయ రసం దాహాన్ని తీరుస్తుందా? భానుడు భగభగమంటున్నాడు. మార్చి నెలలోనే ఎండలు ముదురుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శరీరంలోని నీటి శాతం తగ్గిపోకుండా కాపాడుకోవడానికి పానీయాల అవసరం పెరిగింది. అయితే మార్కెట్లో దొరికే కృత్రిమ కూల్ డ్రింక్స్ కంటే, పోషకాలు నిండిన సహజ రసాల వైపు మొగ్గు చూపాలని నిపుణులు సూచిస్తున్నారు. అందులో చెరుకు రసం, పుచ్చకాయ రసం బెస్ట్ అని చెప్పాలి.చెరకు రసం: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రకారం.. చెరకు రసంలో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఎండలో తిరిగి అలసిపోయిన వారికి ఇది ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుంది. పరిశోధనల ప్రకారం.. చెరకు రసాన్ని 35 నుండి 15 డిగ్రీల సెల్సియస్‌కు చల్లబరచి తాగడం వల్ల అందులోని పోషకాలు దెబ్బతినకుండా శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయి. ఇందులోని పీచు పదార్థం వేసవిలో మందగించే జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయ రసం: కేవలం నీటి శాతం ఆధారంగా చూస్తే, పుచ్చకాయ రసం వేసవిలో అత్యంత అద్భుతమైన పానీయం. ఇందులో దాదాపు 90శాతం నీరు ఉంటుంది. విటమిన్ ఎ, సి మరియు లైకోపీన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఇందులో ఉంటాయి. శరీరానికి తేమను అందించి, దాహాన్ని తీర్చడంలో పుచ్చకాయ రసం ముందుంటుంది. ఇది వాపును తగ్గించి, చర్మ సౌందర్యానికి, గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఏది ఎంచుకోవాలి?: మీరు చేసే పనిని బట్టి ఎంపిక ఉండాలని న్యూట్రియెంట్స్ జర్నల్ పేర్కొంటోంది. ఎండలో శ్రమించే కార్మికులు లేదా ప్రయాణికులకు కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి చెరకు రసం ఉత్తమం. అధిక వేడి వల్ల ఒంట్లో నీరు తగ్గిపోయినట్లు అనిపిస్తే, తక్షణ హైడ్రేషన్ కోసం పుచ్చకాయ రసం బెస్ట్ ఛాయిస్. నిపుణుల సూచనలు: రసాన్ని తీసే విధానం వల్ల పోషకాలు దెబ్బతినకుండా ఉంటాయి. అయితే రసం తీసేటప్పుడు ఉపయోగించే నీటి నాణ్యత, పరిశుభ్రత చాలా ముఖ్యం. తక్షణ దాహం తీర్చుకోవడానికి ఎప్పుడూ శుభ్రమైన తాగునీటిని వెంట ఉంచుకోవాలి.

# ఒంట్లోకి వెళ్తే ఆరోగ్యానికి దివ్యౌషధాలు!



తక్కువ ధరలో లభించే కొత్తిమీర ఆహారం రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. కొత్తిమీరలో విటమిన్లు ఎ, సి, కె, ఖనిజాలు, పీచుపదార్థం పుష్కలంగా ఉంటాయి. ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా తక్కువగా ఉంటుంది. ఆహారానికి రుచిని, సువాసనను పెంచడంలో కొత్తిమీరకు మించిన ఆప్షన్ లేదు. తక్కువ ధరలో లభించే ఈ ఆకుకూర ఆహారం రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. కొత్తిమీరలో విటమిన్లు ఎ, సి, కె, ఖనిజాలు, పీచుపదార్థం పుష్కలంగా ఉంటాయి. ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా తక్కువగా ఉంటుంది. ఇది ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల మైగ్రేన్లు, తలనొప్పులు, థైరాయిడ్, మధుమేహం, కొలెస్ట్రాల్, అజీర్ణం, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అనేక వ్యాధులను నయం చేయడంలోనూ కొత్తిమీర సహాయపడుతుంది.మధుమేహంతో బాధపడేవారికి కొత్తిమీర ఔషధం లాంటిది. దీని ఆకుల్లో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో చురుకైన పాత్ర పోషించే ప్రత్యేక సహజ ఎంజైమ్‌లు ఉంటాయి. ఇందులో సహజ పీచుపదార్థం పుష్కలంగా ఉంటుంది. ఇది ఆహారాన్ని నెమ్మదిగా జీర్ణం చేసి, చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నివారిస్తుంది. మీరు కావాలనుకుంటే, కొత్తిమీర ఆకులను రాత్రంతా నీటిలో నానబెట్టి ఆ నీటిని ఉదయాన్నే తాగవచ్చు. కొత్తిమీరలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి వ్యాధులతో పోరాడే శక్తిని ఇస్తాయి. ఇవి హానికరమైన సూక్ష్మజీవులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడటానికి శరీరానికి సహాయపడతాయి. ఇది శరీర కణాలకు నష్టం జరగకుండా నివారిస్తుంది. దీంతో చాలా కాలం పాటు ఆరోగ్యంగా ఉంచుతుంది.కడుపులో పైత్యరసం లేదా ఆమ్లత్వం పెరిగితే దాని ప్రత్యక్ష ప్రభావం ముఖంపై కనిపిస్తుంది. దీనివల్ల మొటిమలు, దద్దుర్లు వంటి సమస్యలు వస్తాయి. కొత్తిమీర ఆకులకు చల్లదనాన్నిచ్చే గుణం ఉన్నందున అవి శరీరంలోని అధిక ఆమ్లాన్ని, పైత్యరసాన్ని శాంతపరుస్తాయి. ఇది శరీరాన్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. చర్మాన్ని కాంతివంతంగా చేస్తుంది. ముఖంపై ఉన్న మచ్చలను తొలగిస్తుంది.కొత్తిమీరలోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది గ్యాస్, అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణ వ్యవస్థను బలంగా, కడుపును తేలికగా ఉంచుకోవాలనుకుంటే మీ రోజువారీ ఆహారంలో కొద్దిగా కొత్తిమీరను చేర్చుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. కొత్తిమీర సహజ మూత్రవర్ధకంగా పనిచేసి, శరీరం నుంచి అదనపు సోడియంను బయటకు పంపడానికి సహాయపడుతుంది. ఇది రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం కొత్తిమీరను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించవచ్చని తేలింది. కొత్తిమీర ఆకులు చర్మానికి, జుట్టుకు చాలా మేలు చేస్తాయని భావిస్తారు. వీటిలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు జుట్టును ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కాపాడతాయి. జుట్టు రాలడాన్ని నివారిస్తాయి. జుట్టును బలోపేతం చేయడానికి సహాయపడతాయి.

# రాత్రి నిద్ర లేక ఇబ్బందిపడుతున్నారా?



చాలా మహిళలు రాత్రి సమయానికి పడుకున్నా సరిగా నిద్ర పట్టక ఇబ్బంది పడుతున్నారు. నిద్రలోకి వెళ్లిన తర్వాత కూడా మధ్యలో మెలకువ రావడం సాధారణమైపోయింది. జీవనశైలి మార్పులు, మానసిక ఒత్తిడి, ఆందోళనలతో పాటు హార్మోన్ల అసమతుల్యత కూడా దీనికి ముఖ్య కారణాలు. ఇటీవల కాలంలో చాలా మందికి రాత్రిపూట నిద్రపట్టదు. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య చాలా మందిలో కనిపిస్తోంది. దీనికి జీవనశైలి మార్పులు, ఒత్తిడి, ఆందోళనలతో పాటు హార్మోన్ల అసమతుల్యత కూడా ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. మహిళల శరీరం పురుషులతో పోలిస్తే ప్రత్యేకంగా ఉంటుంది. నెలసరి, గర్భధారణ, మెనోపాజ్ వంటి దశల్లో హార్మోన్ల మార్పులు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ స్థాయిల్లో వచ్చే మార్పులు నిద్రపై ప్రభావం చూపుతాయి. ఈస్ట్రోజన్ నిద్రకు సహాయపడే సెరటోనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను కూడా నియంత్రిస్తుంది. కానీ, నెలసరి లేదా మెనోపాజ్ సమయంలో దీని స్థాయి తగ్గితే వేడి అలికిడి, చెమటలు పెరిగి నిద్ర భంగం కలుగుతుంది. ప్రొజెస్టరాన్ మెదడును ప్రశాంతంగా ఉంచే హార్మోన్. లూటియల్ దశలో, గర్భధారణ సమయంలో ఇది ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆ సమయంలో ఎక్కువగా నిద్రగా అనిపిస్తుంది. కానీ నెలసరి ముందు, ప్రసవం తర్వాత దీని స్థాయి తగ్గిపోతే నిద్రలేమి సమస్య వస్తుంది. మెలటోనిన్ నిద్రను నియంత్రించే ప్రధాన హార్మోన్. ఇది మన జీవ గడియారం (సర్కేడియన్ రిథమ్)ను క్రమబద్ధం చేస్తుంది. నిద్ర సమయాలు క్రమంగా పాటించకపోతే దీని ఉత్పత్తి తగ్గి నిద్ర సమస్యలు వస్తాయి. కార్టిసాల్ ఒత్తిడికి సంబంధించిన హార్మోన్. ఇది రాత్రివేళల్లో తగ్గాలి. కానీ ఒత్తిడి ఎక్కువైతే ఇది పెరిగి నిద్రను దెబ్బతీస్తుంది.టెస్టోస్టెరాన్ మహిళల్లో కూడా ఉంటుంది. ఇది నిద్రలోని రెమ్ దశలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. దీని లోపం కూడా నిద్రాభంగానికి దారితీస్తుంది.థైరాయిడ్ హార్మోన్ జీవక్రియను ప్రభావితం చేస్తుంది. ఇందులో మార్పులు వచ్చినా నిద్రపై ప్రభావం పడుతుంది.నిజానికి నిద్ర, హార్మోన్లు పరస్పరం అనుసంధానంగా ఉంటాయి. ఒకటి సరిగ్గా లేకపోతే మరొకటి ప్రభావితమవుతుంది. కాబట్టి కొన్ని అలవాట్లు మార్చుకోవడం అవసరం.ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవాలి. ధ్యానం, యోగా, వ్యాయామం చేయాలి. నిద్రకు గంట ముందు మొబైల్, టీవీ వాడకం మానేయాలి.సాయంత్రం తర్వాత టీ, కాఫీ తగ్గించాలి.మెగ్నీషియం ఉన్న ఆకుకూరలు, నట్స్, గింజలు తీసుకోవాలి.పడకగదిని చల్లగా ఉంచుకోవాలి. ఇన్ని పాటించినా నిద్ర సమస్య కొనసాగితే, వైద్యుల సలహాతో మెలటోనిన్ సప్లిమెంట్లు లేదా అవసరమైన చికిత్సలు తీసుకోవచ్చు.

# సోషల్ మీడియా పరిచయాలు అమ్మాయిలను ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయి

స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు ఎంతోమంది ఆడపిల్లల పాలిట శాపంగా మారుతోందని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వినియోగం పెరిగిన తర్వాత అపరిచితులతో ఏర్పడుతున్నపరిచయాలు యువతుల ను ఊహించని ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు."ఇటీవల కాలంలో ఈ తరహా విషాదకర ఘటనలు నా దృష్టికి ఎక్కువగా వస్తున్నాయి. ఆ కథనాలు చూశాక ఎంతో బాధనిపిస్తోంది. సైబర్ నేరగాళ్లు అందమైన యువకులు లేదా సినీ నటుల ఫోటోలను డీపీలుగా పెట్టుకుని నకిలీ ఖాతాలతో అమ్మాయిలకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి వాటిలో ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. ఆ మాయమాటలకు ఆకర్షితులై కొందరు ఆడపిల్లలు వారిని గుడ్డిగా నమ్మి తమ వ్యక్తిగత ఫోటోలను, వీడియోలను పంచుకుంటున్నారు" అని తెలిపారు. ఆ ఫోటోలను వారితో పంచుకోగానే ఆ అపరిచితు లు రాక్షసులుగా మారిపోయి వాటిని అడ్డంపెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. వాటిని మార్ఫింగ్ చేసి డబ్బులు కావాలని, భౌతికంగా కలవాలని వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పరువు పోతుందన్న భయంతో, ఈ విషయాన్ని ఇంట్లో చెప్పలేక కొందరు అమ్మాయిలు అడిగినంత డబ్బులు ముట్టజెబుతూ తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని, ఈ వేధింపులు తాళలేక కొందరు తమ ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారుఆడపిల్లలకు విజ్ఞప్తి ఒక్కటేనని, మీకు ఆన్‌లైన్‌లో ఇలాంటి సమస్య లేదా అన్యాయం ఎదురైతే అస్సలు భయపడవద్దని, ఆ సైబర్ నేరగాళ్ల బ్లాక్



మెయిలింగ్‌కు లొంగవద్దని, ప్రాణాలు తీసుకోవద్దని సూచించారు. వెంటనే ఈ విషయాన్ని మీ తల్లిదండ్రులకు లేదా స్నేహితులకు చెప్పాలని అన్నారు. ఏమాత్రం సంకోచించకుండా డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మీకు అండగా పోలీసులు ఎల్లప్పుడూ ఉంటారని హామీ ఇచ్చారు.తల్లిదండ్రులు కూడా పిల్లలతో కాస్త సమయం గడుపుతూ, వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనేదానిపై గమనిస్తూ ఉండాలని సూచించారు. ఫేక్ ప్రొఫైల్స్, ఫేక్ నెంబర్లు, వీపీఎన్‌లు వాడితే పోలీసులకు పట్టుబడబోమని సైబర్ నేరగాళ్లు భ్రమల్లో ఉండవద్దని, మీరు ఎక్కడున్నా సరే పట్టుకొచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లలు సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉంటూ, అన్యాయం జరిగితే ధైర్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

## పెద్దమండెం పట్టణంలో మిన్నంటిన రంజాన్ సంబరాలు....

# భక్తిశ్రద్ధలతో సామూహిక ప్రార్థనలు?

**పెద్దమండెం :** క్రమశిక్షణ, దాతృత్వం, సోదరభావానికి ప్రతీకగా నిలిచే రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగను పెద్దమండెం మండల కేంద్రంలో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు అత్యంత నిష్ఠతో ఉపవాస దీక్షలు విరమించిన అనంతరం, ముస్లింలు తమ ఆరాధ్య దైవమైన అల్లాహ్‌ను స్మరిస్తూ ఈద్గా మైదానానికి భారీగా చేరుకున్నారు. ఆధ్యాత్మిక శోభతో మురిసిన ఈద్గా పెద్దమండెం పట్టణంలోని ఈద్గా మైదానం ముస్లిం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే నూతన వస్త్రాలు ధరించిన అబాలగోపాలం ఈద్గాకు చేరుకోవడంతో పట్టణ వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అల్లాహ్ అక్బర్ అంటూ భగవంతుని నామస్మరణతో పరిసర ప్రాంతాలన్నీ మారుమోగాయి.?లోక కల్యాణం కోసం ప్రత్యేక దువా ?వేలాదిమంది భక్తులు ఒకే చోట చేరి సామూహిక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ఖురాన్ సందేశాన్ని పఠించారు. అనంతరం ముస్లిం సోదరులు లోక కల్యాణం కోసం, దేశం సుభిక్షంగా ఉండాలని, ?మత సామరస్యానికి ప్రతీక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' తెలుపుకుంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కులమతాలకు అతీతంగా నిర్వహించిన ఈ వేడుకలు మత సామరస్యానికి అద్దం పట్టాయి. రేణిగుంట పట్టణంలో కూడా ఇదే తరహాలో భక్తి భావం వెల్లివిరిసింది.?పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు?భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈద్గా వద్ద పోలీస్ యంత్రాంగం పటిష్ట బందోబస్తు నిర్వహించింది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, ఎండ తీవ్రత దృష్ట్యా స్వచ్ఛంద సంస్థలు ముందస్తు ఏర్పాట్లు చేశాయి. శాంతియుత వాతావరణంలో పండుగ జరగడంతో ముస్లిం పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.



## జీవన్ రెడ్డి నివాసంలో 'బ్రేక్ ఫాస్ట్' రాజకీయం

# మంత్రుల బుజ్జగింపులు ఫలించేనా?

**కరీంనగర్ :** దశాబ్దాల కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్రను పోషించిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని దారికి తెచ్చుకునేందుకు అధికార పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. పార్టీ ఫిరాయింపులు, వలస నేతల ప్రాధాన్యతపై రగిలిపోతున్న జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు మంత్రుల బృందం రంగంలోకి దిగింది. ఈ ఉదయం ఆయన నివాసంలో జరిగిన ఈ భేటీ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పిలుపును కూడా తిరస్కరించిన జీవన్ రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయన ఇంటికి వెళ్లారు. మీడియాను లోపలికి అనుమతించకుండా, అల్పాహారం చేస్తూ సుమారు గంటన్నర పాటు జీవన్ రెడ్డితో వీరు సుదీర్ఘంగా చర్చలు జరిపారు.మంత్రుల బుజ్జగింపులు – తగ్గని జీవన్ రెడ్డి జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్టానం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయనతో గంటల తరబడి చర్చలు జరిపారు. పార్టీలో మీ ప్రాధాన్యత తగ్గదు, తగిన గుర్తింపు ఇస్తాం అని మంత్రులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, ఆయన మనసు మార్చుకోలేదని తెలుస్తోంది. తన సొంత కేడర్‌కు అన్యాయం జరుగుతున్నప్పుడు పదవుల్లో కొనసాగడం వృథా అని ఆయన మంత్రుల వద్ద కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. దాదాపు గంటన్నర పాటు జరిగిన ఈ భేటీ నిష్ఫలమైందని రాజకీయ



వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు జీవన్ రెడ్డిపై కన్నేశాయి. అటు బీఆర్ఎస్ , ఇటు బీజేపీ ఆయనను తమ పార్టీలోకి ఆహ్వానించేందుకు పావులు కదుపుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో జీవన్ రెడ్డి టచ్‌లోకి వెళ్లారని, 25న రాజీనామా చేసిన వెంటనే జగిత్యాలలో భారీ బహిరంగ సభ ద్వారా గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ కూడా జీవన్ రెడ్డి సీనియారిటీని గౌరవించి, ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. బీజేపీ కూడా ఆయన వంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకుడి కోసం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. కరీంనగర్ రీజియన్‌లో జీవన్ రెడ్డికి ఉన్న పట్టును గమనించి, ఆయనను తమ వైపు తిప్పుకుంటే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తిరుగుండదని కమలనాథులు భావిస్తున్నారు. మొత్తానికి జగిత్యాల రాజకీయాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠను రేపుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా లేదు" అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మంత్రుల ముందే తన ఆవేదనను వెళ్లగక్కినట్లు సమాచారం. సొంత పార్టీ నేతలకు అన్యాయం చేస్తూ, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి పెద్దపీట వేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రులు ఎంత బతిమాలినా జీవన్ రెడ్డి మెత్తబడినట్లు కనిపించడం లేదని సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, కాంగ్రెస్ పార్టీని వీడాలని ఆయన ఇప్పటికే తన నిర్ణయాన్ని తీసేసుకున్నారని తెలుస్తోంది.ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన పదవులకు కూడా జీవన్ రెడ్డి రాజీనామా చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఉగాది తర్వాత తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని చెప్పిన ఆయన, బీఆర్ఎస్ వైపు వెళ్తారా? లేక స్వతంత్రంగా ఉంటారా? అనేది సస్పెన్స్‌గా మారింది.

## డొల్ల బడ్జెట్ ...గోల్ మాల్ బడ్జెట్

**అంకెల గారడితో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం.**

**3లక్షల కోట్ల అప్పుచేసి మూడు అంటే మూడు పథకాలు పూర్తిచేయలేని దుస్థితి రేవంత్ రెడ్డిది.**

**తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ : సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి**

**వనపర్తి :** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన స్వగృహంలో పత్రికా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని,రాష్ట్రాన్ని తిరోగమన దిశలో నెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉందని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలు 11డిక్లరేషన్లు అన్ని మోసమేనని భారతదేశ చరిత్రలో ప్రజలను ఇంత దగాపురితంగా మోసం చేసే బడ్జెట్ నేను చూడలేదని దుయ్యబట్టారు. ఎన్నికల డిక్లరేషన్లో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క వాగ్దానం నిలుపుకోకుండా మహిళలను, వృద్ధులను, దివ్యాంగులను,విద్యార్థినులను,రైతులను,కార్మికులను,ఉపాధి కూలీలను, హరిజన, గిరిజన,బడుగు బలహీన,మైనార్టీ వర్గాలను మోసం చేసి చరిత్రలోకి ఎక్కిందని గౌరవ నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఈ సమావేశములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,మాజీ ఎం.పి.పి కృష్ణా నాయక్,గంధం.పరంజ్యోతి,గోపాల్ పేట మండల అధ్యక్షులు బాలరాజు, పెబ్బేరు మండలం అధ్యక్షులు వనం.రాములు,కర్రెస్వామి,నాయకులు ధర్మా నాయక్, దేవర్ల. నరసింహ,నాగన్న యాదవ్,నారాయణ నాయక్, జోహెబ్ హుస్సేన్, మహేశ్వర్ రెడ్డి,చిట్యాల.రాము,వడ్డే. రమేష్ మంద.రాము,శంకర్ తదితరులు ఉన్నారు.

## రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు

**ఏర్పాట్లను పర్యవేక్షించిన సీపీ సజ్జనార్**

**హైదరాబాద్:** ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద ముస్లింలు భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ప్రార్థనల అనంతరం ఆయన చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులందరూ సుఖసంతోషాలతో, ప్రశాంతంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. రంజాన్ మాసమంతా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగియడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల షాపింగ్ అవసరాలకు, ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశామని, అందరి సహకారంతో వేడుకలు విజయవంతంగా సాగాయని వివరించారు. పండుగ ఏర్పాట్లలో సహకరించిన మత పెద్దలకు, ఇతర ప్రభుత్వ విభాగాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తఫ్సీర్ ఇక్బాల్, (అడిషనల్ సిపి – సౌత్ రేంజ్), .డి.జోయల్ డెవిస్ జాయింట్ సిపి ట్రాఫిక్, ఎన్. స్వేతా, (జాయింట్ సిపి – నార్త్ రేంజ్), .ఆర్.వెంకటేశ్వర్లు డిసిపి సిఎఆర్ హెడ్ క్వార్టర్స్, ఎస్. శ్రీనివాస్, (డిసిపి – రాజేంద్ర నగర్ జోన్), అవినాశ్ కుమార్ డిసిపి ట్రాఫిక్ తదితర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## చదువుకోమని తల్లి మందలింపు

## ఆత్మహత్యకు పాల్పడిన బాలుడు

**మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పూసల తండాలో పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్న రామదాసు, స్వప్న దంపతుల కుమారుడు పవన్(10), ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాఠశాలకు వెళ్లి చదువుకోమని తల్లి మందలించడంతో, ఈ నెల 11వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రోజులుగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.


## ఆపేసిన అభివృద్ధి పనులు ప్రారంభించాలి

**సిద్దిపేట :** బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిద్దిపేట నియోజకవర్గానికి మంజూరు చేసిన రూ.1,070 కోట్ల అభివృద్ధి పనులను రేవంత్ రెడ్డి వచ్చాక రద్దు చేశాడని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. మీ సిద్దిపేట వెటర్నరీ కాలేజీను కొండగల్ ఎత్తుకపోయినా, మీ అభివృద్ధి పనులను ఆపేసిన అని చెప్పేందుకు సిద్దిపేటకు వస్తున్నావా రేవంత్ రెడ్డి? రద్దు చేసిన రూ.1,070 కోట్ల పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

## మూసి తీరంలో అక్రమ సమోసాల దందా

**హైదరాబాద్ :** హైదరాబాద్‌వాసులు ఇష్టమైన చిరుతిండి సమోసా వెనుక దాగి ఉన్న భయంకరమైన నిజం వెలుగులోకి వచ్చింది. పైన కరకరలాడుతూ, లోపల రచిగా అనిపించే సమోసాలు వాస్తవానికి కుళ్లిపోయిన పదార్థాలతో తయారవుతున్నాయే షాకింగ్ నిజాన్ని కుల్సుంపురా పోలీసులు బయటపెట్టారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ ఆపరిశుభ్ర వాతావరణంలో కల్తీ పదార్థాలతో సమోసాలు తయారు చేస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రాములు, ఎస్సై నర్సింహ తన టీంతో కలిసి జియాగూడ బైపాస్ రోడ్డులోని మూసీ తీరంలో ఉన్న ఒక షెడ్డుపై ఆకస్మిక దాడి చేశారు. గోల్కొండకు చెందిన అబ్దుల్ రషీద్ (73)అనే వ్యక్తి ఈ కేంద్రాన్ని నిర్వహిస్తు న్నాడు. గత కొంత కాలంగా ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తుంగలో తొక్కి ఇక్కడ సమోసాలు తయారీ సాగుతోంది. కేవలం లాభార్జనే ధ్యేయంగా పెట్టుకున్న నిర్వాహకుడు ఐదారుగురు కార్మికులతో కలిసి ఈ అక్రమ కేంద్రాన్ని నడుపుతున్నాడు. పోలీసుల తనిఖీల్లో వెలుగు చూసిన దృశ్యాలు అధికారులనే విస్మయానికి గురి చేశాయి. ఈ కేంద్రంలో వినియోగిస్తున్న పదార్థాలన్నీ అత్యంత నాసిరకమైనవి, అనారోగ్యకరమైనవి. సమోసాలు నింపే మిశ్రమం కోసం కుళ్లిపోయిన కోడిగుడ్లను వినియోగిస్తున్నారు. కాలం చెల్లిన, పదే పదే మరిగించిన కల్తీ వంట నూనెలను ఇక్కడ వాడుతున్నారు. సమోసా తయారీలో ఉపయోగించే ఆలుగడ్డలు, ఇతర కూరగాయలు కూడా కుళ్లిపోయినవేనని పోలీసులు ధ్రువీకరించారు. నిల్వ ఉండిపోయిన పురుగు పట్టిన మైదా పిండిని వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నారు. ఈ కేంద్రంలో తయారైన కల్తీ సమోసాలు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కావడం లేదు. జియాగూడ పరిసర ప్రాంతాల్లో అనేక హోటళ్లు, బేకరీలు, వీధి వ్యాపారులకు ఇక్కడి నుంచి పెద్ద మత్తంలో సరకు సరఫరా అవుతోంది. వినియోగదారులు ఆ రుచికి ఆకర్షితులవుతు న్నప్పటికీ, లోపల జరుగుతున్న ఈ అక్రమ తంతూ ఎవరికీ తెలియదు. సాధారణంగా ఏదైనా ఆహార పదార్థాల తయారీ కేంద్రం నడపాలంటే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టారండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి లైసెన్స్ పొందాలి. కానీ అబ్దుల్ రషీద్ నడుపుతున్న ఈ షెడ్డుకు ఎటువంటి అనుమతులు లేవు. పూర్తి అపరిశుభ్రమైన వాతావరణంలో నేలపైనే పిండిని కలుపుతూ, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా వ్యాపారం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ దాడిలో పోలీసులు పెద్ద మొత్తంలో మైదా, కల్తీ నూనెలు, కుళ్లిన గుడ్లు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు అబ్దుల్ రషీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ దందాలో ఇంకా ఎవరి ప్రమేయం ఉంది, ఎక్కడెక్కడికి సరఫరా చేస్తున్నారు అనే కోంలో దర్యాప్తు చేస్తున్నారు.

## భారంగా మారనున్న చికెన్



**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ప్రియులకు ఆదివారం భోజనం భారంగా మారబోతోంది. నిన్నటి వరకు సాదాసీదాగా ఉన్న కోడి మాంసం ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. కేవలం ఒక్క రోజులోనే భారీగా ధరలు పెరగడంతో వినియోగదా రులు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా ఏపీలో నిన్నటి కంటే ఈరోజు ఏకంగా రూ. 70 అదనంగా పెరగడం గమనార్హం.విజయవాడలో స్కిన్ లెస్ చికెన్ కిలో ధర రూ. 380 నుండి రూ. 400 వరకు పలుకుతోంది. హైదరాబాద్ లో కిలో చికెన్ రూ. 340 నుండి రూ. 350 మధ్య విక్రయిస్తున్నారు. అసలు దీని ధర అడిగితేనే గుండె జారిపోయేలా ఉంది. కిలో నాటుకోడి ఏకంగా రూ. 800 పలుకుతోంది. అంటే దాదాపు మటన్ ధరతో పోటీ పడుతోంది.వ్యాపారులు మరియు పౌల్ట్రీ రైతుల విశ్లేషణ ప్రకారం ఈ పెరుగుదల వెనుక ఐదు కీలక కారణాలు ఉన్నాయి. తీవ్రమైన ఎండల వల్ల కోళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. దీంతో మార్కెట్‌లోకి రావాల్సిన సప్లై గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రంజాన్ పండుగ కావడంతో చికెన్ వినియోగం విపరీతంగా పెరిగింది. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో డిమాండ్ రెట్టింపయింది. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగాయి. అలాగే కోళ్లకు వేసే దానా ధరలు కూడా పెరగడంతో పౌల్ట్రీ రైతులు రేట్లు పెంచక తప్పడం లేదు.

# బిజినెస్

## ప్రీమియర పెట్రోల్ ధర పెంపు



ప్రీమియం పెట్రోల్ ధరలను పెట్రోలియం సంస్థలు పెంచాయి. పవర్ పెట్రోల్ ధరను లీటర్‌కు రెండు రూపాయిలను పెంచినట్లు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) ప్రకటించింది. అలాగే, బిపిసిఎల్ స్పీడ్, ఐఓసిఎల్ ఎక్స్‌పి95 వంటి ప్రీమియం పెట్రోల్ ధరలను ఆయా సంస్థలు పెంచాయి. ప్రాంతాన్ని బట్టి లీటరుకు రూ.2.09 నుంచి రూ.2.35 వరకూ ఈ ప్రీమియం పెట్రోల్ ధరను పెంచాయి. శుక్రవారం నుంచే పెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయి. సాధారణ పెట్రోల్ ధరల్లో మార్పు లేనట్లు తెలిపింది. అలాగే, ఇండిస్ట్రియల్ డీజిల్ ధర లీటర్‌పై రూ.22 పెరిగింది. సాధారణ డీజిల్ ధరలు యథాతథంగా ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో మూడు రకాలుగా పెట్రోల్ లభిస్తోంది. ఒకటి సాధారణ పెట్రోల్, మరొకటి ప్రీమియం. మూడోది హై ఆక్టేన్ ప్రీమియం. మెరుగైన ఇంజిన్ పనితీరు, మైలేజ్ కోసం వాహనాల్లో ప్రీమియం పెట్రోల్‌ను ఉపయోగిస్తారు. ప్రస్తుత ధరల పెంపు హై-ఆక్టేన్, ప్రీమియం పెట్రోల్ వాడే వినియోగదారులను ప్రభావితం చేస్తుంది. అయితే 'ముడిచమురు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదు. అదనపు నిల్వలు కూడా మార్గమధ్యంలో ఉన్నాయి. అధికారిక అప్‌డేట్లను విశ్వసించండి' అని హెచ్‌పిసిఎల్ ప్రకటనలో తెలిపింది.

## టాటా మోటార్స్ కార్ల ధరల పెంపు

ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ 2026 ఏప్రిల్ 1 నుండి తన ప్యాసింజర్ వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. రూపాయి అమాంతం పతనం, ముడి సరుకుల వ్యయాలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పెరిగిన ముడి సరుకుల వ్యయాలను పాక్షికంగా భర్తీ చేసేందుకు ధరలను పెంచినట్లు కంపెనీ వెల్లడించింది. పెట్రోల్ డీజిల్ వాహనాలపై సగటున 0.5 శాతం వరకు ధరలు పెరగనున్నాయి. ఇప్పటికే కమర్షియల్ వాహనాలపై 1.5 శాతం పెంపును ప్రకటించిన టాటా మోటార్స్, ఇప్పుడు కార్ల ధరలను కూడా పెంచడం సామాన్యుడికి భారంగా మారనుంది. కేవలం టాటా మోటార్స్ మాత్రమే కాకుండా, దేశీయ ఆటోమొబైల్ రంగం మొత్తం ధరల పెంపు దిశగా అడుగులు వేస్తోందని సంకేతాలు వస్తోన్నాయి. జర్మన్ లగ్జరీ కార్ల సంస్థ ఆడి ఇప్పటికే ఏప్రిల్ నుంచి 2 శాతం పెంపును ప్రకటించగా, దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ కూడా ధరల సవరణపై సమీక్ష నిర్వహిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో లోహాల ధరలు పెరగడం, రూపాయి విలువ పతనం వంటి అంశాలు వాహన తయారీ వ్యయాలను పెంచుతున్నాయని, దీనివల్ల రాబోయే రోజుల్లో మరిన్ని కంపెనీలు ధరలను పెంచే అవకాశం ఉందని ఆటోమొబైల్ పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు.

# ఐఫోన్ యూజర్లకు కొత్త టెన్షన్..
# కోట్లాది మందికి పొంచి ఉన్న ముప్పు



ఐఫోన్ వినియోగదారులను వణికించే మరో ప్రమాదకరమైన స్పైవేర్ వెలుగులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో ఉన్న ఐఫోన్లను లక్ష్యంగా చేసుకుని 'డార్క్ స్వార్డ్' అనే అత్యంత శక్తివంతమైన స్పైవేర్ దాడి చేస్తోందని భద్రతా పరిశోధకులు హెచ్చరించారు. గూగుల్, లుకౌట్, ఐ-వెరిఫై సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ మాల్వేర్ ఇన్ఫెక్ట్ అయిన వెబ్‌సైట్ల ద్వారా వేగంగా వ్యాపిస్తోందని ఔఱుం పేర్కొంది. దీని సాయంతో హ్యాకర్లు వినియోగదారుల ఫోన్ల నుండి అత్యంత సున్నితమైన వ్యక్తిగత డేటాను దొంగిలిస్తున్నట్లు నిపుణులు గుర్తించారు.సౌదీ అరేబియా, టర్కీ, మలేషియా, ఉక్రెయిన్ వంటి దేశాల్లోని ప్రముఖ వ్యక్తులే లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నాయని గూగుల్ వెల్లడించింది. ముఖ్యంగా ఉక్రెయిన్‌కు చెందిన వార్తా వెబ్‌సైట్లు మరియు ప్రభుత్వ సంస్థల సైట్లలో ఈ మాల్వేర్‌ను నిక్షిప్తం చేసినట్లు సమాచారం. ఆ సైట్లను సందర్శించిన వారి ఫోన్ల నుండి సమాచారాన్ని సేకరించేందుకు హ్యాకర్లు దీనిని వాడుతున్నారు. ఈ స్పైవేర్ వెనుక కొన్ని వాణిజ్య సంస్థలతో పాటు, ప్రభుత్వ మద్దతు ఉన్న హ్యాకర్ల హస్తం కూడా ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఇటీవలే వెలుగులోకి వచ్చిన కొరునా అనే మరో స్పైవేర్‌తో కలిసి ఈ 'డార్క్ స్వార్డ్' పనిచేస్తోంది. ఈ రెండు హ్యాకింగ్ టూల్స్ కలిస్తే క్రిప్టోకరెన్సీ వాలెట్లను ఖాళీ చేయడంతో పాటు, ఫోన్‌లోని పూర్తి వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకర్ల చేతుల్లో పెట్టగలవని పరిశోధకులు చెబుతున్నారు. అయితే.. ఈ మాల్వేర్ తాజా ఐఓఎస్ వెర్షన్లపై ప్రభావం చూపనప్పటికీ, ఐఓఎస్ 18 (తీూ 18) వెర్షన్ వాడుతున్న ఫోన్లపై సమర్థవంతంగా పనిచేస్తోంది. ప్రస్తుతానికి మార్కెట్లో దాదాపు పావు వంతు ఐఫోన్లు పాత ఓఎస్ వెర్షన్లపైనే నడుస్తుండటంతో ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉంది. గతంలో కూడా ఆపిల్ పరికరాల్లో ఇలాంటి భద్రతా లోపాలు తలెత్తాయి. గత ఏడాది మే నెలలో ఎయిర్ ప్లే ఫీచర్‌లోని లోపాన్ని ఉపయోగించుకుని ఒకే వైఫై నెట్‌వర్క్‌లో ఉన్న డివైజ్‌లను హ్యాక్ చేసే అవకాశం ఉందని గుర్తించారు. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా అత్యంత అధునాతన దాడుల ద్వారా లాక్ చేసిన ఐఫోన్లలో 'యూఎస్‌బీ రెస్ట్రిక్టెడ్ మోడ్'ను నిలిపివేసే ప్రయత్నం జరిగిందని ఆపిల్ స్వయంగా వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఐఫోన్ వినియోగదారులు తమ ఫోన్లను వెంటనే లేటెస్ట్ సాఫ్ట్‌వేర్ వెర్షన్‌కు అప్‌డేట్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## టెలికాం రంగంలో కీలక పరిణామం..
# వొడాఫోన్ ఐడియాలో కలవనున్న బిఎస్ఎన్ఎల్!





ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నెట్‌వర్క్ పరిధిని మరింత విస్తరించుకోవాలనే లక్ష్యంతో వోడాఫోన్ ఐడియా ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్ఎన్ఎల్ చేతులు కలుపబోతోంది. ఈ రెండు సంస్థలు తమ వద్ద ఉన్న టెలికాం టవర్లు, ఆప్టికల్ ఫైబర్ స్పెక్ట్రమ్ వంటి వనరులను ఒకరికొకరు పంచుకోవడంపై చర్చలు ప్రారంభించాయి. మౌలిక సదుపాయాలను పంచుకోవడం వల్ల నెట్‌వర్క్ నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని, ఇది ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రెండు సంస్థలకు ఎంతో ఊరటనిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ బలంగా ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో వొడాఫోన్ ఐడియా మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి. ఈ ఒప్పందం కుదిరితే రెండు సంస్థల వినియోగదారులకు మెరుగైన సిగ్నల్, డేటా సేవలు అందుతాయి. జియో, ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ సంస్థలతో పోటీ పడటానికి ఈ సహకారం అత్యంత కీలకం కానుంది. అయితే, ఈ ఒప్పందంపై తుది నిర్ణయం పూర్తిగా వాణిజ్యపరమైన అంశాలపై ఆధారపడి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వోడాఫోన్ ఐడియా సుమారు 20.5 కోట్ల మేర వినియోగదారులను కలిగి ఉంది. దేశంలో అతిపెద్ద ప్రైవేట్ టెలికాం ఆపరేటర్‌గా కొనసాగుతోంది. ఇందులో యాక్టివ్ కస్టమర్లు 19.3 కోట్లుగా ఉంగా.. మార్కెట్ వాటా 17.5 శాతం నుంచి 18 శాతం ఉంది. గత కొన్ని ఏళ్లుగా జియో, ఎయిర్‌టెల్ నుంచి ఎదురవుతున్న తీవ్ర పోటీ వల్ల వోడాఫోన్ ఐడియా ప్రతి నెలా సగటున 10 లక్షల నుంచి 20 లక్షల వరకు వినియోగదారు లను కోల్పోతూ వస్తోంది. వోడాఫోన్ ఐడియా వినియోగదారులలో మెజారిటీ భాగం ఇంకా 4జీ నెట్‌వర్క్‌లోనే ఉన్నారు. ఇటీవల నిధుల సేకరణ తర్వాత 5ఉ సేవలను విస్తరించడం ద్వారా వినియోగదారులను నిలుపుకోవాలని సంస్థ ప్రయత్నిస్తోంది. ఇక ప్రభుత్వ రంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్‌కు సుమారు 9.5 కోట్లు మంది వినియోగదారులు ఉండగా, మార్కెట్ వాటా 8 శాతం నుంచి 8.5 శాతంగా ఉంది. వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్లు 40 లక్షలకు పైగా ఉండటం విశేషం.

# 'వస్తారు కోట్లు పట్టుకెళ్తారు.. ప్రయోజనమెవరికీ'!



ఐపీఎల్ 2026 సీజన్ మరో వారం రోజుల్లో మొదలుకానుంది. కానీ ఐపీఎల్‌లో ఈసారి ఆటగాళ్ల గాయాల సమస్యలు పెరిగిపోయాయి. ముఖ్యంగా వేలంలో కోట్ల ధర పలికిన విదేశీ ఆటగాళ్ల గాయాలు, వ్యక్తిగత కారణాలతో లీగ్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానుండడం ఆయా ఫ్రాంచైజీలపై ప్రభావం చూపనుంది. ఇప్పటికే సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ వెన్ను గాయం నుంచి కోలుకోకపోవడంతో సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు కమిన్స్ అందుబాటులో ఉండడం లేదు. దీంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తూ ఎస్‌ఆర్‌హెచ్ నిర్ణయం తీసుకుంది. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ రాయల్‌చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) స్టార్ బౌలర్ జోష్ హాజిల్‌వుడ్ కూడా గాయంతో దూరమయ్యాడు. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్‌కు గాయాల బెడద తగిలింది. ఆ జట్టు స్టార్ మిచెల్ స్టార్క్ గాయంతో సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా క్రికెట్ ఆస్ట్రేలియాపై విమర్శలు చేశాడు. 'మిచెల్ స్టార్క్ సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడం లేదని తెలిసింది. ఇప్పటికే జోష్ హాజిల్‌వుడ్, పాట్ కమిన్స్‌లు దూరమయ్యారు. తాజాగా స్టార్క్ గాయంతో బాధపడుతున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) పేర్కొంది. కానీ నిజానికి అతను ఫిట్‌గా ఉన్నప్పటికీ సీఏ మాత్రం ఏవో సాకులు చెప్పి అతన్ని ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడకుండా చూస్తుంది. స్టార్క్ టీ20 క్రికెట్‌కు ఎప్పుడో వీడ్కోలు పలికాడు. మరి రెండు నెలలుగా స్టార్క్ విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా ఏం చేసినట్లు? అంతేకాదు స్టార్క్ యాషెస్ సిరీస్ తర్వాత మళ్లీ మ్యాచ్‌లు ఆడలేదు. అయితే భారత్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ నేపథ్యంలో మొదట విశ్రాంతి తీసుకోమని పేర్కొన్న సీఏ ఆ తర్వాత మాట మార్చి ఐపీఎల్‌కు అందుబాటులో ఉంటాడని తెలిపింది. కానీ ఇప్పుడెందుకు ఇలా ప్రవర్తిస్తుందో అర్థం కావడం లేదు. ఇక న్యూజిలాండ్ బౌలర్ లోకీ ఫెర్గూసన్ విషయం నన్ను మరింత ఆశ్చర్యపరుస్తోంది. గాయం లేనప్పటికీ కుటుంబంతో కొంత సమయం గడిపేందుకు ఫెర్గూసన్ ఐపీఎల్‌లో తొలి ఏడు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడం లేదని తెలిసింది. ఇది దారుణమైన అంశం. ప్రస్తుతం ఫెర్గూసన్ సౌతాఫ్రికాతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతున్నాడు. అది ముగియగానే తన కుటుంబంతో గడిపేందుకు న్యూజిలాండ్ వెళ్లనున్నాడు. అది అతని వ్యక్తిగత విషయం కావొచ్చు, కానీ ఐపీఎల్‌లో ఒక జట్టుకు ఆడుతూ ఏడు మ్యాచ్‌ల తర్వాత జట్టులో చేరి రూ.కోటి తీసుకొని వెళ్లిపోతాడు. కానీ దీనివల్ల ఎవరికీ ప్రయోజనం? ప్రతీ ఐపీఎల్‌లో ఇది సర్వసాధారణంగా కనిపిస్తూనే ఉంది.' అని వెల్లడించాడు.

## రాములోరి సన్నిధిలో లక్నో క్రికెటర్లు..
# అన్ని విజయాలే సిద్ధించాలని పూజలు..!



ఐపీఎల్‌కు కౌంట్‌డౌన్ మొదలవ్వడంతో ఇప్పటికే పలు ఫ్రాంచైజీల ఆటగాళ్లు నెట్స్‌లో చెమటోడ్చుతున్నారు. ఆర్సీబీ, చెన్నై సూపర్ కింగ్స్ క్రికెటర్లు ప్రాక్టీస్ ముమ్మరం చేయగా.. లక్నో సూపర్ జెయింట్స్ సైతం మైదానంలోకి దిగనుంది. పంతొమ్మిదో సీజన్‌లో కొత్త జెర్సీతో ఆడనున్న లక్నో జట్టు.. టోర్నీ సన్నద్ధతకు ముందు అయోధ్యలోని రామజన్మ భూమిని దర్శించుకుంది. శనివారం కెప్టెన్ రిషభ్ పంత్ ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గొయెంకా సహా క్రికెటర్లు రాములోరి దీవెనలు తీసుకున్నారు. పంతొమ్మిదో సీజన్‌ను గొప్పగా ఆరంభించాలనే ఉద్దేశంతో లక్నో సూపర్ జెయింట్స్ ఆటగాళు రాముడి ఆలయాన్ని సందర్శించారు. దేవుడి ఆశీస్సులతో టోర్నీలో ఇరగదీసేందుకు సిద్ధమవుతున్నారు. శనివారం తమ టీమ్ అయోధ్య రాముడిని దర్శించుకున్న ఫోటోలను లక్నో ఫ్రాంచైజీ సోషల్ మీడియాలో పంచుకుంది. 'రాముడికి ప్రార్థనలు చేయడం కొత్తమే కాదు. ఐపీఎల్ కొత్త సీజన్ ప్రారంభం కాబోతున్న వేళ.. మా జట్టు ఆటగాళ్లందరు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆ రాముడి ఆశీర్వాదం ఉంటే అన్నీ అనుకూలంగా జరుగుతాయి' అని సంజీవ్ గొయెంకా ఏఎన్ఐతో తెలిపాడు. ఐపీఎల్‌లో మూడుసార్లు ప్లే ఆఫ్స్ వరకూ పరిమితమైన లక్నో సూపర్ జెయింట్స్ గత సీజన్‌లో తీవ్రంగా నిరాశపరిచింది. రిషభ్ పంత్ కెప్టెన్సీలో ఆరే విజయాలతో నాకౌట్‌కు ముందే నిష్క్రమించింది. అయితే.. ఈసారి కొత్త జెర్సీతో ఆడనున్న లక్నో మైదానంలో చెలరేగిపోవాలనుకుంటోంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఏప్రిల్ 11న మ్యాచ్‌తో లక్నో టోర్నీలో అడుగు పెట్టనుంది.

# స్పోర్ట్స్

## ఐర్లాండ్‌తో రెండు టీ20లు..
## షెడ్యూల్ రిలీజ్ చేసిన బీసీసీఐ



**ముంబై:** టీ20 వరల్డ్ చాంపియన్స్ టీమిండియా.. జూన్‌లో ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌లు ఆడనున్నది. దీనిపై ఇవాళ బీసీసీఐ ప్రకటన రిలీజ్ చేసింది. జూన్ 26, 28 తేదీల్లో ఆ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఆ రెండు మ్యాచ్‌లు బెల్‌ఫాస్ట్ వేదికగా జరగనున్నాయి. 2007 తర్వాత మళ్లీ బెల్‌ఫాస్ట్ మైదానంలో ఇండియన్ జట్టు టీ20 మ్యాచ్ ఆడనున్నది. టీమిండియా సీనియర్ జట్టు జూన్‌లో ఐర్లాండ్‌కు వెళ్లనున్నట్లు బీసీసీఐ తన ప్రకటనలో వెల్లడించింది. అయితే ఇప్పటి వరకు గత ఎనిమిదేళ్లలో మూడు సార్లు ఐర్లాండ్‌లో భారత్ పర్యటించింది. 2018, 2022, 2023 సంవత్సరాల్లో ఐర్లాండ్ టూరుకు ఇండియా వెళ్లింది. కానీ బెల్‌ఫాస్ట్‌లో 2007 తర్వాత ఆడడడం ఇదే మొదటిసారి అవుతుందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. భారత్ టూరు గురించి రెండు రోజుల క్రితమే ఐర్లాండ్ డైరెక్టర్ గ్రాహమ్ వెస్ట్ కన్ఫర్మేషన్ ఇచ్చారు. జూన్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో ఓ టెస్టు మ్యాచ్, మూడు వన్డేలు ఆడిన తర్వాత భారత జట్టు ఐర్లాండ్ వెళ్తుంది. ఆఫ్ఘన్‌తో సిరీస్ జూన్ 20 నాటికి ముగుస్తుంది. ఇక ఇంగ్లండ్ పర్యటన కన్నా ముందే ఐర్లాండ్‌లో రెండు టీ20 మ్యాచ్‌లను ఇండియా ఆడనున్నది. జూలై ఒకటి నుంచి 19 వరకు ఇంగ్లండ్‌తో 5 టీ20లు, మూడు వన్డేలు ఇండియా ఆడనున్న విషయం తెలిసిందే.



## వరుస ఫ్లాప్స్ తర్వాత స్పీడ్ పెంచిన నితిన్... మూడు కొత్త ప్రాజెక్టులతో సక్సెస్ ట్రాక్‌పైకి

టాలీవుడ్ హీరో నితిన్ ప్రస్తుతం తన కెరీర్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, గత కొన్నేళ్లుగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయారు. 'చెక్', 'రంగ్ దే', 'మ్యాస్ట్రో', 'మాచర్ల నియోజకవర్గం', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి చిత్రాలు ప్రేక్షకులను నిరాశపరచగా, గతేడాది విడుదలైన 'తమ్ముడు', 'రాబిన్‌హుడ్' సినిమాలు కూడా డిజాస్టర్లుగా మారి ఆయన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఈ పరిస్థితుల్లో రూట్ మార్చిన నితిన్, కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన టాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. విభిన్న కాన్సెప్ట్‌లతో సినిమాలు తెరకెక్కించే ఆనంద్, నితిన్ కోసం ఒక కొత్త తరహా కథను సిద్ధం చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి ఆసక్తి నెలకొంది. ఇంతలోనే నితిన్ మరో రెండు క్రేజీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందులో ఒకటి 'ఆయ్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న దర్శకుడు అంజి చెప్పిన కథ. ఈ చిత్రాన్ని నితిన్ తన సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ట్ మూవీస్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. జూలై నుంచి షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇదే కాకుండా, మరో ప్రముఖ నిర్మాణ సంస్థలో ఒక కొత్త దర్శకుడితో సినిమా చేయడానికి కూడా నితిన్ సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే నెలలో వెలువడే అవకాశం ఉంది. నితిన్ 2002లో తేజ దర్శకత్వంలో వచ్చిన 'జయం' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్ననితిన్ ఆ తర్వాత 'దిల్', 'సై' సినిమాలతో యూత్‌కు దగ్గరయ్యారు. అయితే మధ్యలో వరుస ఫ్లాప్స్‌తో సతమతమవుతున్న సమయంలో 2012లో వచ్చిన 'ఇష్క్' ఆయన కెరీర్‌కు మళ్లీ ఊపిరి పోసింది. అదే ఊపులో 'గుండె జారి గల్లంతయ్యిందే', 'హార్ట్ ఎటాక్', 'అ ఆ', 'భీష్మ' వంటి విజయాలతో బాక్సాఫీస్ వద్ద తన స్థాయిని నిరూపించారు. ముఖ్యంగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వచ్చిన 'అ ఆ' నితిన్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచింది. అలాగే 'భీష్మ' కూడా ఆయనకు పెద్ద హిట్‌గా నిలిచింది. అయితే ఆ తర్వాత వచ్చిన చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో, ఈసారి కథల ఎంపికలో నితిన్ మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.




## ఇది సినిమా కాదు.. ప్రేక్షకుల సహనానికి పరీక్ష.. 'ధురంధర్ 2'పై నటి రమ్య విమర్శలు!

బాలీవుడ్ స్టార్ దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ హీరోగా వచ్చిన 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధిస్తున్నప్పటికీ మరోవైపు విమర్శలను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా అధికార పార్టీ బీజేపీ ప్రచార చిత్రమని ఇప్పటికే పలువురు ప్రముఖులతో పాటు నటులు ప్రకాశ్ రాజ్, మలయాళ దర్శకుడు దేవదత్ షాజీ తదితరులు ఈ సినిమా ఉద్దేశిస్తూ పరోక్షంగా కామెంట్లు చేశారు. అయితే తాజాగా కన్నడ నటి, మాజీ ఎంపీ రమ్య కూడా స్పందిస్తూ.. ఈ సినిమాపై విమర్శలు గుప్పించారు. రమ్య ఎక్స్ వేదికగా ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. ఇప్పుడే 'ధురంధర్ 2' చూశాను.. బాబోయ్.. ఎంతో కంటెంట్ ఉన్న ఒక కథను ప్రేక్షకుల సహనానికి పరీక్షగా ఎలా మార్చాలో ఈ సినిమా ద్వారా నేర్చుకోవచ్చు. ఈ సినిమా చూస్తుంటే అసలు ముగింపు లేని ఒక బోరింగ్ సబ్జెక్ట్ చదువుతున్నట్లు ఉంది. ఒకానొక దశలో మన మెదడు పనిచేయడం ఆగిపోయి, స్క్రీన్ మీద జరుగుతున్న ఘోరాన్ని చూసి విరక్తితో నవ్వొస్తుంది. మీకు నిజంగా ఈ సినిమా చూడాలని ఉంటే, దయచేసి థియేటర్‌కు వెళ్లి మీ సమయాన్ని, డబ్బును వృధా చేసుకోవద్దు. ఇది కేవలం ఓటీటీలో చూస్తూ, మధ్యలో ఫోన్ స్క్రోల్ చేస్తూ, అసలు నా జీవితం ఎటు వెళ్తోంది? అని ప్రశ్నించుకోవడానికి పనికొచ్చే సినిమా మాత్రమే. దర్శకత్వం, డైలాగులు, ఎడిటింగ్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్, యాక్టింగ్.. ఇలా అన్నీ కూడా చాలా నాసిరకంగా ఉన్నాయి. మార్చి 19న రిలీజ్ డేట్ ఉందని వీరికి ఎవరూ చెప్పలేదా? లేక అంతా చెత్తగా ఉందని తెలిసినా "పర్లేదులే.. పంపించేయండి" అని రిలీజ్ చేసేశారా? అనిపిస్తుంది. 'ధురంధర్' మొదటి భాగం చూస్తున్నప్పుడు థియేటర్లో ఈలలు, చప్పట్లు, ఒక రకమైన ఎనర్జీ ఉండేవి. కానీ సెకండ్ పార్ట్‌లో ప్రేక్షకులు అస్సలు కనెక్ట్ అవ్వలేదు. థియేటర్ అంతా ఒక రకమైన నిరాశ స్పష్టంగా కనిపిస్తోంది. ఇక రణవీర్ సింగ్ ఈ సినిమాను తన భుజాలపై మోశారు అని అంటున్న వారికి నాదొక ప్రశ్న.. ఆయన అసలు ఏం మోశాడు? నాకు అక్కడ కేవలం ఆయన జుట్టు మాత్రమే కనిపించింది. మొదటి భాగంలో ఆ జుట్టుకు ఒక పర్సనాలిటీ, ఒక క్యారెక్టర్ ఉండేది. కానీ ఇందులో అది ప్రతి సీన్‌ను అడ్డుకుంటూ పిచ్చిగా ఉంది. బహుశా ఆ జుట్టుకు 'బెస్ట్ సపోర్టింగ్ రోల్' నామినేషన్ ఇవ్వాలేమో. సినిమాలో హింస గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఇది సినిమా లాగా లేదు..




## ఆకట్టుకుంటున్న బ్యాండ్ మేళం ట్రైలర్

కోర్టు చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న రోషన్, శ్రీదేవి తాజాగా బ్యాండ్ మేళం అనే చిత్రంలో జంటగా నటించారు. ఈ సినిమాను మార్చ్ 26న విడుదల చేయనున్నారు.దాంతో ఈరోజు ఉదయం చిరంజీవి గారి చేతుల మీదుగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇది ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది. ఈ ట్రైలర్‌లో గ్రామీణ నేపథ్యంలో సాగే కథను వినోదాత్మక సన్నివేశాలతో ఆసక్తికరంగా చూపించారు. రోషన్ తన నటనతో మెప్పించగా, శ్రీదేవి నటన, అందంతో ఆకట్టుకుంది. ట్రైలర్‌లో కామెడీ, ఎమోషన్, ప్రేమ అంశాలు సమానంగా కనిపించాయి. ఈ చిత్రానికి సతీష్ జవ్వాజి దర్శకత్వం వహించగా, ప్రముఖ కథ రచయిత కోన వెంకట్ నిర్మించారు. ఈ ట్రైలర్‌ను ప్రజెంట్ చేసిన విధానం, ఇందులో వచ్చిన నేపథ్య సంగీతం అన్నీ కలగలిపి ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలను రేకెత్తిస్తున్నాయి. మరి కోర్టు మూవీతో మంచి సక్సెస్ అందుకున్న ఈ జంట 'బ్యాండ్ మేళం'తో కూడా అదే ఇంపాక్ట్‌ను చూపిస్తుందేమో చూడాలి. ఈ చిత్రాన్ని మొదట మార్చ్ 13న విడుదల చేయాలని అనుకున్నారు. అందుకు అనుగుణంగా పెద్ద ఎత్తున ప్రచారాలను కూడా నిర్వహించారు. కానీ సడన్గా పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కిన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయనున్నట్లు ప్రకటించడంతో ఈ మూవీ బృందం వెనక్కు తగ్గి సినిమా విడుదలను పోస్ట్ పోన్ చేసుకుంది. అలా దాదాపు ఈ సినిమా మొదట అనుకున్న దానికంటే రెండు వారాలు ఆలస్యంగా విడుదల అవుతుంది. దానితో ఈ మూవీ బృందం వారు ఈ రెండు వారాల్లో కూడా ప్రమోషన్లను గట్టిగానే నిర్వహించారు. అది కూడా ఈ సినిమాకు కాస్త ప్లస్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## త్వరలో పెళ్లి? మొహమాటమే లేదన్న హీరో

ఇప్పటివరకు తేజ సజ్జాను హీరోగానే చూశాం.. కానీ త్వరలో అతడిని ఓ హోస్ట్‌గానూ చూడబోతున్నాం. బాలీవుడ్‌లో వచ్చిన ద ట్రైటర్ షో త్వరలోనే తెలుగులోనూ రానుంది. సెలబ్రిటీలు పాల్గొనే ఈ షోకి తేజ సజ్జా వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని అమెజాన్ ప్రైమ్ అధికారికంగా వెల్లడించింది.

మొహమాటం లేదు

ఇదిలా ఉంటే తాజాగా ఓ ఈవెంట్‌లో తేజ సజ్జా పెళ్లి వార్తలపై స్పందించాడు. త్వరలోనే నా పెళ్లి జరుగుతుందని ప్రచారం చేస్తున్నారు. అందులో నిజం లేదు. ఏదైనా ఉంటే నేనే చెప్తాను. ఒకవేళ పెళ్లి చేసుకుంటే నిర్మొహమాటంగా సిల్వర్ జ్యువెలరీ వేసుకుని మరీ ఆ ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తాను. ఇకపోతే ఇక్కడ స్వయంవరం జరగడంలేదు, కాబట్టి నా పెళ్లి గురించి చర్చ వద్దు అని చెప్పాడు.

టాలీవుడ్‌లో పెళ్లి సందడి

కాగా ఈ ఏడాది ప్రారంభంలోనే పలువురు సెలబ్రిటీలు పెళ్లిపీటలెక్కారు. విజయ్ దేవరకొండ- రష్మిక మందన్నా ఫిబ్రవరి 26న వివాహం చేసుకున్నారు. అల్లు అర్జున్ సోదరుడు, హీరో శిరీష్ మార్చి 6న పెళ్లి చేసుకున్నాడు. కొంతంకాలంగా ప్రేమలో ఉన్న నయనికా రెడ్డి మెడలో మూడు ముళ్లు వేశాడు. తాజాగా బిగ్‌బాస్ బ్యూటీ పునర్నవి భూపాలం కూడా వైవాహిక బంధంలో అడుగుపెట్టింది. అటు బెల్లంకొండ శ్రీనివాస్ కూడా ఇటీవలే తనకు కాబోయే భార్యను పరిచయం చేశాడు.



## ఓటీటీలో చూడకపోతే చాలా మిస్ అయినట్టే



కొంతమంది స్టార్ హీరోలు నటించిన సినిమాలతో పోలిస్తే పెద్దగా అంచనాలు లేని చిన్న సినిమాలు ఈ మధ్యకాలంలో ఓటీటీలో పెద్ద స్థాయిలో ఇంపాక్ట్ చూపిస్తున్నాయి.ఓ లేడీ ఓరియంటెడ్ చిత్రం ప్రస్తుతం డిజిటల్ ప్లాట్ ఫామ్ లో అద్భుతమైన రికార్డులను సొంతం చేసుకుంటుంది. ఇంతకు ఆ సినిమా ఏది అనుకుంటున్నారా? ఆ చిత్రం పేరు మేడ్ ఇన్ కొరియా. ఇందులో 'ఓజీ' బ్యూటీ ప్రియాంక అరుల్ మోహన్ ప్రధాన పాత్రలో నటించింది. ఈ ముద్దుగుమ్మ నటించిన మొదటి లేడీ ఓరియంటెడ్ చిత్రం ఇదే కావడం విశేషం. ఇందులోని ఈమె నటనకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సినిమా థియేటర్లలో కాకుండా నేరుగా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ తమిళ చిత్రం 2026 మార్చి 12 నుంచి 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. చిన్నప్పటి నుండి కొరియా వెళ్లాలని ఎంతో ఆశ ఉన్న అమ్మాయి ఒక అబ్బాయితో ప్రేమలో పడుతుంది. కొరియా వెళ్ళాక అతడు మోసం చేశాడని తెలుసుకొని బాధపడి, ఆ తర్వాత తనకు నచ్చిన దేశంలో ఎలా జీవితాన్ని ముందుకు సాగించింది అనే పాయింట్ తో ఈ చిత్రం ముందుకు సాగుతుంది. చాలా సింపుల్ స్టోరీ లైన్ అయినా కూడా ఈ చిత్రాన్ని దర్శకుడు కార్తీక్ అద్భుతంగా డీల్ చేశాడు. చాలామంది దీనిపై మంచి ఫీల్ గుడ్ చిత్రమని ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ చిత్రానికి జనాల నుండి మంచి రెస్పాన్స్ వస్తుండడంతో 'నెట్‌ఫ్లిక్స్'లో ఈ మూవీ ఇండియాలో నెంబర్ 1 స్థానంలో ట్రెండ్ అవుతుంది. ఈ మధ్యకాలంలో భారీ క్రేజ్ ఉన్న సినిమాల ఓటీటీ ఎంట్రీ లేకపోవడంతో మరికొంత కాలం పాటు ఈ సినిమా ఇంపాక్ట్ ఇలాగే కొనసాగుతుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com